



సాగనంపేశారు!

- కలెక్టర్ సీసీ వీరేశ్‌పై బదిలీ వేటు
- ఏళ్ల తరబడి పాతుకుపోవడంతో ఎట్టకేలకు తప్పించిన కలెక్టర్
- తొండంగి డిప్యూటీ తహశీల్దార్‌గా పంపేసిన వైనం
- వైసీపీ అయిదేళ్ల పాలనలో అంతా ఆయన ఇష్టారాజ్యం
- 'అంటకాగి పైరవీలకేగి' అంటూ జూలై 26న 'ఆంధ్రజ్యోతి'లో కథనం

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

జిల్లా కలెక్టర్ సీసీ వీరేశ్‌పై ఎట్టకేలకు వేటుపడింది. ఏళ్ల తరబడి కలెక్టర్ల వద్ద సీసీగా పాతుకుపోయిన ఆయనను ప్రస్తుత కలెక్టర్ షాన్‌మోహన్ తప్పించారు. తొండంగి మండల డిప్యూటీ తహశీల్దార్‌గా పోస్టింగ్ ఇచ్చారు. కలెక్టర్ సీసీగా వీరేశ్ దందాలపై జూలై 26న ఆంధ్రజ్యోతిలో 'అంటకాగి.. పైరవీలకేగి' అంటూ కథనం వచ్చింది. కలెక్టర్ బంగ్లా ఖర్చుల పేరుతో సీసీ సాగించిన వసూళ్లపై అందులో ప్రస్తావించడంతో జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ దీనిపై దృష్టిసారించారు. గత వైసీపీ ప్రభుత్వ హయాం నుంచీ కలెక్టర్ సీసీగా కొనసాగుతున్న వీరేశ్ జిల్లాకు ఏ కలెక్టర్ వచ్చినా ఆయనదే హవా. వైసీపీ నేతల సహకారంతో ఈయన గడిచిన అయిదేళ్లుగా అంతా ఇష్టారాజ్యమైంది. బంగ్లా ఖర్చుల పేరుతో కీలక శాఖల జిల్లా అధికారుల నుంచి తెగ కాసులు పిండేశాడు. కలెక్టర్ పేరు చెప్పి ఫైళ్లు చదవడం, అధికారులకు ఫోన్లు చేసి కలెక్టర్ సీరియస్‌గా ఉన్నారంటూ హెచ్చరించి జేబులు నింపేసుకున్నాడనే ఆరోపణలు ఉన్నాయి. టీడీపీ మాజీ ఎమ్మెల్యేలు ఎవరొచ్చినా కలెక్టర్ లేరనే సమాధానం, వైసీపీ నేతలు చెప్పినట్టు తలూపి వారికి అపాయింట్‌మెంట్లు ఇవ్వకుండా చేసి తెగ రెచ్చిపోయాడు. సీసీ హోదాలో కలెక్టరేట్‌లో ఇతర విభాగాలపై పెత్తనం చేసి సొంత పనులు చేయించుకోవడంలో ఆరితేరిపోయాడు. పౌర సరఫరాల శాఖలో డీటీ కేడర్ నుంచి సీసీగా డిప్యూటేషన్‌పై వచ్చిన ఈయన ప్రభుత్వం మారడంతో సీసీగా డిప్యూటేషన్ రద్దయితే జిల్లాపై పెత్తనం పోతుందనే భయంతో పైరవీలకు దిగాడు. కానీ ఈలోపే ఆంధ్రజ్యోతిలో వీరేశ్ లీలలపై కథనం రావడంతో బండారం బయటపడింది. కలెక్టర్ సైతం పూర్తి సమాచారం రప్పించుకుని ఏళ్ల తరబడి పాతుకుపోవడంతో సీసీ పోస్టు నుంచి తప్పించేశారు.



పెదపూడిలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ షాన్‌మోహన్

పెదపూడిలో కలెక్టర్ పర్యటన

కాకినాడ సిటీ, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): జిల్లాలో అన్ని ప్రాంతాల్లో చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రాలను వినియోగంలోకి తీసుకురావడంతోపాటు చెత్త నుంచి తయారైన వర్మి కంపోస్టు వినియోగంపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ షాన్‌మోహన్ పేర్కొన్నారు. క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా కలెక్టర్ గురువారం పెదపూడి మండలంలో పర్యటించారు. రామేశ్వరం గ్రామంలో ఉపాధి హామీ పథకం నిధులతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు, పెదపూడిలోని తహశీల్దార్ కార్యాలయం, సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని సంబంధిత అధికారులతో కలిసి ఆయన పరిశీలించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అలాగే గ్రామంలో ఇంటింటి నుంచి చెత్త సేకరించే విధానం, తడి చెత్త పొడి చెత్త వేర్వేరు ప్రక్రియలోని దశలు, వర్మి కంపోస్టు తయారీని పరిశీలించారు. ఈ పర్యటనలో కలెక్టర్ వెంట పెదపూడి మండల తహశీల్దార్ పీవీ సీతాపతిరావు, ఎంపీడీవో కెనరేంద్రరెడ్డి, సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ పి.అనూష, ఈవోపీఆర్డీ ఎం. సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టార్గెట్ 'పుష్కర'

- ఎత్తిపోతల పథకం పునరుజ్జీవానికి అసెంబ్లీలో ఎమ్మెల్యేల వాణి
- ఇదే అంశంగా ఆయకట్టు ప్రజాప్రతినిధులంతా చర్చ
- పైప్‌లైన్ల మరమ్మతులకు అంచనాలను వేస్తున్నామని మంత్రి రామానాయుడు స్పష్టత
- మెట్ట రైతుల్లో మళ్లీ ఆశలు

పుష్కర ఎత్తిపోతల పథకం విలువేమిటో ఇప్పుడు అందరికీ తెలిసివస్తోంది. గడిచిన వైసీపీ పాలనలో ఈ పథకాన్ని మూలనపడవేసి రైతాంగాన్ని ఎంతగా నష్టపరిచిందో ప్రతి ఒక్కరికీ అర్థమవుతోంది. ప్రధానంగా వైసీపీ కుట్ర రాజకీయాలకు నేరుగా బలైన అన్నదాతలకు మళ్లీ ఆశలు చిగురిస్తున్నాయి. ఈసారి అసెంబ్లీ సమావేశాల్లో పుష్కర ఎత్తిపోతల పథకం ద్వారా ఆధారపడిన ఆయకట్టు రైతాంగానికి పూర్తి స్థాయిలో సాగునీటి ఇవ్వాలని జిల్లా ఎమ్మెల్యేలు ప్రస్తావించారు. ప్రధానంగా పుష్కర ఎత్తిపోతల పథకంలో భాగమైన తాళ్లూరు లిఫ్ట్ ఇరిగేషన్ దుస్థితిని ఎమ్మెల్యేలు శాసనసభలో చర్చ లేవనెత్తారు. దీంతో జలవనరుల శాఖామంత్రి నిమ్మల రామానాయుడు సైతం దీనిపై స్పష్టత ఇచ్చారు. దీంతో తమ వ్యవసాయ భూములకు సాగునీరు అందడానికి మార్గం సుగమం అయినట్టుగానే రైతాంగం ఆశిస్తోంది.

జగ్గంపేట, నవంబరు21(ఆంధ్రజ్యోతి): మెట్ట రైతాంగానికి సాగునీరు ఎప్పుడూ ఎండమావే. వాన వస్తేనే పంట. లేదంటే కరువే. మెట్ట రైతులంటేనే అందరికీ చిన్నచూపు. కానీ ఆ పరిస్థితులను సమూలంగా మార్చేందుకు దశాబ్దాల కిందటే బీజం పడింది. అందులో భాగంగానే మెట్ట రైతుల ఆశాదీపంగా తోట వెంకటాచలం పుష్కర లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ శ్రీకారం చుట్టుకుంది. పురుషోత్తపట్నం సమీపంలోని గోదావరి నుంచి 1505 క్యూసెక్కుల నీటిని పంపింగ్ చేసి 1.86 లక్షల ఎకరాలకు సాగునీరు, 18 మండలాల ప్రజలకు తాగునీరు అందించాలనే లక్ష్యంతో ఈ పథకం మొదలైంది. మొత్తం రూ.608.04 కోట్ల అంచనా వ్యయంతో ఈ ప్రాజెక్టు మొదలైంది. గోదావరి జలాలను మెట్ట ప్రాంతానికి మళ్లించే బృహత్తర పథకంలో భాగంగా 2004-2006 మధ్య పుష్కర కాలువ నిర్మాణం చేపట్టారు. సీతానగరంలో తోట వెంకటాచలం ఎత్తిపోతల పథకం పేరిట ఆనాడు సోనియాగాంధీ జగ్గంపేట నియోజకవర్గంలో పైలాన్ ఆవిష్కరించడంతోపాటు జగ్గంపేట నియోజకవర్గం గండేపల్లి మండలం తాళ్లూరు గ్రామంలో ఏర్పాటుచేసిన పంపింగ్ స్కీమ్ వద్ద పుష్కర ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభించారు. సీతానగరంలో మొదలైన ఈ పుష్కర ప్రాజెక్టు రాజానగరం, రాజమండ్రి రూరల్, అనపర్తి, జగ్గంపేట, ప్రత్తిపాడు, పిఠాపురం, పెద్దాపురం, తుని, పాయకరావుపేట వరకు విస్తరించి ఉండేలా, మొత్తం రూ.608.04 కోట్ల వ్యయంతో ఈ ప్రాజెక్టును పూర్తి చేయాల్సి ఉంది. కానీ తర్వాత ఈ పథకం నత్తనడకన సాగింది. రెండు దశాబ్దాలు గడిచినా అనుకున్న లక్ష్యాన్ని చేరలేదు. నిర్మాణ వ్యయం 2015 నాటికి రూ.686.89 కోట్లకు చేరింది. పుష్కరకు అనుసంధానమైన అనేక లిఫ్ట్ ఇరిగేషన్‌లు తర్వాతకాలంలో అతీగతీ లేకుండా పోయాయి. గత టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పుష్కర ప్రాజెక్టుపై దృష్టి పెట్టింది. 2015-16లో బడ్జెట్‌లో రూ.65 కోట్లు కేటాయించి తిరిగి రైతుల్లో ఆశలు నింపింది. పనులు మళ్లీ కదిలాయి. కానీ గత వైసీపీ ప్రభుత్వం పూర్తిగా ఎత్తిపోతల పథకాలను పక్కనపెట్టేసింది. ఈ ప్రాజెక్టులో కీలకమైన గండేపల్లి మండలం తాళ్లూరు లిఫ్ట్‌పై ఏకంగా 26,311 ఎకరాలు, తాళ్లూరు 2బిపై 4,796 ఎకరాల సాగు ఆధారపడి ఉంది. ఈ లిఫ్ట్ ఇరిగేషన్ పథకాలు లీకేజీల కారణంగా అస్తవ్యస్తమైంది. దీనితోపాటు రాజపూడి ఎత్తిపోతల పథకం వద్ద కూడా పైపులైను పూర్తిగా పాడవడంతో మోటార్లు పనిచేయడం లేదు. దీనివల్ల రైతులు తాము వేసిన పంటలను మధ్యలోనే వదిలేయాల్సిన దుస్థితి. ఎన్నోసార్లు మొరపెట్టుకున్నా గత వైసీపీ ప్రభుత్వం తాళ్లూరు లిఫ్ట్ ఇరిగేషన్‌పై కనికరం చూపలేదు. దీంతో ఏటా రైతులు భారీగా నష్టపోతూనే ఉన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత మళ్లీ తాళ్లూరు లిఫ్ట్ ఇరిగేషన్‌పై ప్రజాప్రతినిధులు దృష్టిపెట్టారు. ఏకంగా 31 వేల ఎకరాలకు అవసరమైన ఈ లిఫ్ట్‌లను తక్షణం అందుబాటులోకి తేవాలని, లీకేజీల కారణంగా జరుగుతున్న నష్టాన్ని తొలగించాలని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ప్రయత్నిస్తూ వచ్చారు. ప్రస్తుత ఖరీఫ్ పంటలో ఈ ఆయకట్టు పరిధిలో సాగునీరందించడానికి జ్యోతులతోపాటు ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు కృషిచేసి కొంత సఫలమయ్యారు. కొన్ని ప్రాంతాల్లో పంటలు వేయవద్దని, వేసి నష్టపోవద్దని ఎమ్మెల్యే నెహ్రూ ముందస్తుగానే అవగాహన కల్పించారు. సాగునీరు అందించాలంటే మోటార్లతోపాటు పైప్‌లైన్లు అవసరం. తగిన సామర్థ్యంలో పైప్ లైన్‌లు లేకుండా పంటలు వేస్తే నష్టపోతారని ఆయన హెచ్చరించారు. అయితే కాలం కలిసి రావడంతో ఈసారి పంటలు సజావుగా సాగు చేసి ఒడ్డుకు చేరే పరిస్థితి వచ్చింది. ఈ నేపథ్యంలోనే పుష్కర ఎత్తిపోతల పరిధిలోని ఎమ్మెల్యేలంతా వ్యూహాత్మకంగా అసెంబ్లీలో చర్చకు లేవనెత్తారు. జగ్గంపేట, తుని, పెద్దాపురం, ప్రత్తిపాడు ఎమ్మెల్యేలు తమకు వచ్చిన అవకాశాన్ని ఈ సమస్యపైనే దృష్టి నిలిపేలా చర్చించారు. పుష్కర ఎత్తిపోతల పథకానికి రూ.49 కోట్లు మరమ్మతులకు ఖర్చవుతుందని, దీనిని ప్రభుత్వం చెల్లించి పుష్కర ఎత్తిపోతల పథకానికి పూర్వ వైభవం తీసుకురావాలని కోరారు. ముఖ్యంగా తాళ్లూరు లిఫ్ట్ ఇరిగేషన్‌లో మోటార్ పైప్‌లైన్లు పూర్తిగా దెబ్బతిన్నందున తక్షణం మరమ్మతులు చేపట్టాలని డిమాండు చేశారు. సీతారామపురం, రాజపూడి గ్రామాల్లో ఎత్తిపోతల పథకాలుండగా వీటికి గతంలో సిమెంటు పైపుల ద్వారా గోదావరి జలాలను లిఫ్ట్ చేసి పంపించేవారు. ఈ పైపులు తరచూ పాడవడంతో వేలాది ఎకరాలకు నీరు చాలకపోవడంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సిమెంటు పైపుల స్థానంలో 3.5 కిలోమీటర్ల మేర ఐరన్ పైపులను అమర్చి పూర్తిస్థాయిలో అంటే 31 వేల ఎకరాలకు సాగునీరు అందించడానికి రూ.49 కోట్లు ఖర్చు అవుతుందని, దీన్ని తక్షణమే ప్రభుత్వం అందించడం కానీ, రైతాంగం దృష్టిలో పెట్టుకుని ప్రైవేట్ కాంట్రాక్టర్లకు ఇచ్చి మరొక విధానంలోనైనా రైతులను ఆదుకోవాలని కూటమి ప్రభుత్వ నేతలను మెట్ట ప్రాంత రైతులు కోరుతున్నారు.



పుష్కర.. పట్టించుకోండి..

తుని రూరల్, నవంబరు21(ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ శీతాకాల సమావేశాల్లో తుని రైతాంగ ప్రజల సమస్యలపై ఎమ్మెల్యే యనమల దివ్య స్పీకర్ దృష్టికి తీసుకెళ్లారు. పుష్కర ఎత్తిపోతల పథకం ద్వారా తుని నియోజకవర్గంలో పుష్కర కాలువ కింద 6 వేల ఎకరాలు సాగు అవ్వాల్సి ఉండగా గత వైసీపీ పాలనలో పంట కాలువలు నిర్వీర్యం అయ్యాయన్నారు. సంబంధిత మంత్రి చొరవ చూపి త్వరితగతిన పూడికతీత పనులు చేపట్టి కాలువ ఆధునీకీకరించాలని కోరారు. తొండంగి మండలంలో ప్రధాన సాగు, తాగునీటి వనరులుగా ఉన్న 80 ఎకరాల చెరువు ఆక్రమణ గురైందని, గత పాలకుల అండగా ఆ ప్రాంత ప్రజలను బెదిరించిన వైసీపీ సానుభూతి పరులు చెరువుని కబ్జా చేసి చేపల చెరువులు తవ్వారన్నారు. కబ్జాదారుల కబంద హస్తాల నుంచి చెరువుని విడిపించాలని మంత్రిని కోరారు.



ఇరిగేషన్ ప్రాజెక్టులు చేపట్టాలి

సీఎంను కోరిన ప్రత్తిపాడు ఎమ్మెల్యే

ప్రత్తిపాడు, నవంబరు21(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న ఇరిగేషన్ ప్రాజెక్టులను పూర్తి చేయాలని సీఎం చంద్రబాబును ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా కోరారు. గురువారం సీఎం చంద్రబాబును అమరావతిలో కలిసి సత్యప్రభ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని పలు సమస్యలు ఎమ్మెల్యే సీఎం దృష్టికి తీసుకెళ్లారు. ఏలేరు రిజర్వాయర్ ప్రాజెక్టు, సుబ్బారెడ్డి సాగర్ ప్రాజెక్టు, చంద్రబాబు సాగర్ ప్రాజెక్టులను అభివృద్ధి చేయాలని కోరారు. నియోజకవర్గంలో గత వైసీపీ ప్రభుత్వం కనీసం రహదారుల అభివృద్ధికి కూడా చర్యలు తీసుకోలేదని, అధ్వాన్నంగా మారిన రహదారుల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే సత్యప్రభ సీఎం చంద్రబాబును కోరారు.

'మేత'పై తేల్చేద్దాం!



'ఆంధ్రజ్యోతి' ఎఫెక్ట్

- గనులశాఖ డీడీ కార్యాలయంలో అవినీతిపై విచారణ మొదలు
- ఆఫీసును మామూళ్లకు అడ్డాగా మార్చేసిన అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులపై ఆరా
- ఒక్కొక్కరుగా ఉద్యోగులను పిలిపించి వివరాలు సేకరిస్తోన్న జేసీ
- లీజుదారులకు అడ్డగోలు సహకారం, లంచాలమేతపై లోతుగా విచారణ
- అవినీతి భాగోతంపై రెండు మూడు రోజుల్లో కలెక్టర్‌కు నివేదిక అందజేత
- 17 ఏళ్లుగా చక్రం తిప్పుతోన్న మహిళా అవుట్‌సోర్సింగ్ ఉద్యోగిలో వణుకు
- కొలువుపై వేటు నుంచి తప్పించుకునేందుకు ఓ నేత వద్దకు పరుగు

జిల్లా గనులశాఖ డీడీ కార్యాలయంలో లంచాల మేతపై జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్‌మీనా విచారణతో గుబులు మొదలైంది. ఏళ్లతరబడి అడ్డుఅదుపూ లేకుండా మామూళ్లు పిండేస్తోన్న కొందరు అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల్లో వణుకు అంతకంతకు ఎక్కువవుతోంది. జేసీ విచారణలో ఎక్కడ దొరికిపోతామోనన్న కలవరం వీరిని వెన్నాడుతోంది. దీంతో కొందరు మైనింగ్ లీజుదారుల సాయంతో కొలువు పోకుండా పైరవీలకు దిగుతున్నారు. ఓ అధికార పార్టీ నేత వద్దకు వెళ్లి ఎలాగోలా చేసిన పాపాల నుంచి బయటపడేందుకు పావులు కదుపుతున్నారు. జిల్లా గనులశాఖ డీడీ కార్యాలయాన్ని అవినీతికి చిరునామాగా మార్చేసి, మైనింగ్ లీజుదారులతో కుమ్మక్కై కొందరు అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు సాగిస్తోన్న దందాపై ఈనెల 16న 'పెద్ద ఘనులే' అంటూ ఆంధ్రజ్యోతిలో కథనం వెలువడింది. ఈ నేపథ్యంలో అక్రమార్కుల బండారం బయట పెట్టాలని కలెక్టర్ జేసీని ఆదేశించారు.

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

గనులశాఖ డీడీ కార్యాలయంలో ప్రభుత్వ ఉద్యోగులపై అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల పెత్తనం అధికంగా మారింది. క్వారీలు,గ్రావెల్ లీజుదారుల అక్రమాలకు అడ్డగోలుగా సహకరిస్తూ వారి నుంచి భారీ మొత్తంలో కొందరు అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు నొక్కేస్తున్నారు. ప్రభుత్వ కార్యాలయాన్ని ప్రైవేటు వ్యక్తులకు రాసిచ్చేశారు. ఏకంగా డీడీ కార్యాలయంలో ఫైళ్లు, కంప్యూటర్‌లు సైతం వారి చేతికే అప్పగించేసి 17ఏళ్ల నుంచీ ఇక్కడే పాతుకుపోయిన ఓ మహిళా అవుట్‌సోర్సింగ్ ఉద్యోగి మొత్తం తన కనుసన్నల్లో కార్యాలయాన్ని నడిపిస్తున్నారు. లీజుదారులు, రాజకీయ నేతలతో ఏళ్లతరబడి పరిచయాలు పెంచుకుని లీజుల్లో అక్రమ తవ్వకాల దగ్గర నుంచి పర్మిట్ల కొనసాగింపు, నచ్చని లీజుదారులకు ఫైన్‌ల విధింపు వరకు ఆమె అంతా అయి నడిపిస్తున్నారు. ప్రధానంగా రామేశం మెట్టలో గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అయిదేళ్ల పాటు అడ్డుఅదుపూ లేకుండా సాగుతోన్న అక్రమ తవ్వకాలతో రూ.650కోట్లకుపైగా గ్రావెల్ తరలిపోయింది. ఇందులో కోట్లకొద్దీ రాయల్టీ డబ్బు ప్రభుత్వ ఖజానాకు గండిపడింది. ఈ మైనింగ్ అక్రమాలపై ఏనాడు గనులశాఖ దాడులు చేయలేదు. ఇచ్చిన పర్మిట్ల ముసుగులో లక్షల క్యుబిక్‌మీటర్ల గ్రావెల్ బయటకు పోయినా కన్నెత్తి చూడలేదు. వీటన్నింటికి అధికారుల తరఫున సదరు అవుట్‌సోర్సింగ్ ఉద్యోగి అక్రమార్కులకు కొమ్ముకాస్తూ భారీగా సంపాదించేశారు. అటు ప్రభుత్వానికి రావలసిన ఆదాయానికి గండికొట్టేసి అడ్డంగా ఆర్జించేశారు. దీనిపై 'ఆంధ్రజ్యోతి'లో ఈనెల 16న కథనం రావడంతో లోతుగా విచారణ చేయించాలని జిల్లా కలెక్టర్ శాన్‌మోహన్ నిర్ణయించారు. ఈమేరకు జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనాను నివేదిక ఇవ్వాలని ఈనెల 17న ఆదేశించారు. దీంతో జేసీ రెండు రోజులుగా విచారణ మొదలు పెట్టారు. డీడీ కార్యాలయంలో పనిచేస్తోన్న శాశ్వత, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను పిలిపించి విచారించారు. లీజుదారులకు ఏవిధంగా అడ్డగోలుగా సహకరిస్తోంది ఆరా తీశారు. లీజు అక్రమాలపై అసలు తనిఖీలు చేస్తున్నారా?లేదా? పర్మిట్లు ముగిసిన తర్వాత వ్యాపారులకు కొమ్ముకాస్తూ తవ్వకాలకు అనుమతించడంలో ఎవరు ఎలా చక్రం తిప్పుతున్నారు? తదితర కోణాల్లో విచారించారు. దీంతో బయట వ్యక్తుల పెత్తనంపై కొన్ని వాస్తవాలు జేసీ దృష్టికి వచ్చాయి. అయితే జేసీ విచారణతో తన బండారం బట్టబయలై చేసిన అవినీతి బయటకు వస్తుందన్న భయంతో సదరు ఏళ్ల తరబడి పాతుకుపోయిన అవుట్‌సోర్సింగ్ ఉద్యోగి ఓ నేత వద్దకు పరుగులు తీసింది. జేసీ విచారణతో ఇరుక్కుపోకుండా చూడాలంటూ పైరవీలు మొదలుపెట్టింది. మరోపక్క తనపేరు పక్కకుపోయేలా సహ అవుట్ సోర్సింగ్ ఉద్యోగి ఒకరు వసూళ్లకు కేంద్రబిందువు అంటూ దొంగ ఫిర్యాదులు రాయించడం మొదలుపెట్టింది. తద్వారా తప్పించుకోవడానికి అన్ని దారులు వెదుకుతోంది. మరోపక్క సదరు ఉద్యోగి తీరుతో జేసీ విచారణ మొదలవడంతో అందరం ఇరుక్కుపోయామంటూ ఉద్యోగుల్లో కలవరం మొదలైంది. ఇప్పటికే డీడీ ప్రసాద్‌ను, అంతకుముందు పనిచేసిన డీడీ నరసింహరెడ్డిని అక్రమాల నేపథ్యంలో ప్రభుత్వం సెలవుపై పంపేసింది. ఇప్పుడు అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల దందాతో డీడీ కార్యాలయం పరువు బజారునపడింది. ఇదిలాఉంటే గనులశాఖలో అవినీతిపై విచారణ కొనసాగిస్తోన్న జేసీ ఒకటి రెండురోజుల్లో డీడీ కార్యాలయంలో తనిఖీలకు వెళ్లనున్నారు. మరోపక్క ఇక్కడి కార్యాలయంలో జరుగుతోన్న దందాపై తన విచారణ జరుగుతున్న తీరును కలెక్టర్‌కు జేసీ గురువారం వివరించారు. సాధ్యమైనంత త్వరగా విచారణ పూర్తిచేసి కలెక్టర్‌కు ఆయన నివేదిక ఇవ్వనున్నారు. అయితే లంచాల్లో ఆరితేరిపోయిన సదరు అవుట్‌సోర్సింగ్ ఉద్యోగిని తప్పించడమా? వేరేశాఖకు పంపడమా? అనేదానిపై తేల్చనున్నారు.

గిరిజన కమిషన్ సభ్యుడు నేడు, రేపు పర్యటన

కలెక్టరేట్(కాకినాడ)/శంఖవరం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర గిరిజన కమిషన్ సభ్యుడు వడిత్యశంకర్‌నాయక్ కాకినాడ జిల్లాలో శుక్ర, శనివారాల్లో శంఖవరం మండలంలోని వివిధ గ్రామాల్లో పర్యటించనున్నట్టు కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర గిరిజన కమిషన్ సభ్యుడు వడిత్యా శంకర్‌నాయక్ జిల్లాలో శుక్రవారం ఉదయం 7 గంటల 30 నిమిషాలకు కాకినాడ నుంచి బయలుదేరి ఉదయం 10 గంటలకు శంఖవరం మండలంలో అనుమర్తి గ్రామానికి చేరుకుంటారన్నారు. అక్కడ గిరిజన ప్రజలతో భేటీ అవుతారు. వారి సమస్యలు తెలుసుకుంటారు. అక్కడ నుంచి బయలుదేరి శంఖవరం మండలం అవేల్తి గిరిజన గ్రామం చేరుకుంటారు. అక్కడ గిరిజన ప్రజలతోనూ భేటీ అవుతారు. భోజన విరామం తర్వాత అక్కడ నుంచి బయలుదేరి శంఖవరం మండలం ఓంద్రిగుల గ్రామం చేరుకుంటారు. అక్కడ గిరిజనుల సమస్యలను తెలుసుకుంటారు. సాయంత్రం 4 గంటలకు బయలుదేరి కాకినాడలోని జేఎన్‌టీయూ గెస్ట్‌హౌస్‌కి రాత్రి 7 గంటలకు చేరుకుంటారు. శనివారం ఉదయం 7 గంటలకు జేఎన్‌టీయూ నుంచి బయలుదేరి శంఖవరం మండలం పెద్దూరు ట్రైబల్ గ్రామానికి వెళ్లి అక్కడ గిరిజనులతో మమేకమవుతారు. అక్కడ నుంచి బయలుదేరి గిన్నలారం గ్రామానికి చేరుకుని అక్కడ గిరిజనుల సమస్యలను తెలుసుకుంటారు. అనంతరం అక్కడ భోజన విరామం తర్వాత రెండు గంటలకు గిన్నలారం నుంచి బయలుదేరి సాయంత్రం నాలుగు గంటల నుంచి ఆరు గంటల వరకు వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహిస్తారు.

సంక్రాంతికి కొత్త రేషన్ కార్డులు

- అదేరోజు లబ్ధిదారుని చేతికి
- డిసెంబరు 2వ తేదీ నుంచి 20వ తేదీ వరకు దరఖాస్తుల స్వీకరణ
- జిల్లాలో అన్ని సచివాలయాల్లో దరఖాస్తుల స్వీకరణ
- వేలాది మందికి లబ్ధి

కలెక్టరేట్(కాకినాడ), నవంబరు 21(ఆంధ్రజ్యోతి): వచ్చే జనవరి నెలలో సంక్రాంతి పండుగ రోజున లబ్ధిదారులకు కొత్తరేషన్ కార్డులు అందించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. ఈ మేరకు జిల్లా అధికారులకు ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది. డిసెంబరు 2వ తేదీ నుంచి డిసెంబరు 20వ తేదీ వరకు జిల్లాలో అన్ని సచివాలయాల్లో రేషన్‌కార్డులకు దరఖాస్తులు స్వీకరించనున్నారు. గ్రామ, వార్డు సచివాలయాల్లో సిబ్బంది స్వీకరించిన దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. తర్వాత ఈకేవైసీ జరుగుతుంది. ఆరెంచెల విధానంలో పరిశీలించిన తర్వాత దరఖాస్తులను వీఆర్వో పరిశీలిస్తారు. తదుపరి తహశీల్దార్ కార్యాలయానికి పంపిస్తారు. నిబంధనలను అనుసరించి అర్హులైన వారికి కొత్తరేషన్ కార్డులను జారీచేస్తారు. వైసీపీ ప్రభుత్వంలో కొత్తరేషన్ కార్డులు జారీచేస్తామని ప్రకటించి లబ్ధిదారులకు మొండిచేయి చూపించారు. ఈ నేపథ్యంలో లబ్ధిదారులంతా కూటమి ప్రభుత్వంపై కోటి ఆశలు పెట్టుకున్నారు. కాకినాడ జిల్లాలో ప్రస్తుతం 6,54,592 తెలుపు రేషన్ కార్డులు ఉన్నాయి. దీనిలో ఏఏవై కార్డులు 23786, పీహెచ్‌ఎచ్ కార్డులు 6,31,406 కార్డులున్నాయి. కొత్తకార్డుల మంజూరుతో ఆ సంఖ్య గణనీయంగా పెరగనుంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఐదు నెలలు దాటింది. దీంతో కొత్తరేషన్‌కార్డుల కోసం లబ్ధిదారులు అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో రేషన్‌కార్డుదారులకు కష్టాలు తీరనున్నాయి. ఈవిషయమై జిల్లా పౌర సరఫరాలశాఖ అధికారి ప్రసాద్‌ను ఆంధ్రజ్యోతి సంప్రదించగా జిల్లాలో అర్హులైన లబ్ధిదారులు అందరికీ సంక్రాంతి రోజున రేషన్ కార్డుల పంపిణీ జరుగుతుందన్నారు. కుటుంబంలో ఉన్న వారందరి పేర్లు ఆయా కార్డుల్లో నమోదు చేయడం జరుగుతుందని చెప్పారు.

జిల్లాలో మూడు ఇసుక స్టాక్ యార్డుల నిర్వహణకు 22 టెండర్లు దాఖలు

నేడు లాటరీ విధానంలో పెద్దాపురం, కాకినాడ రూరల్, గొల్లప్రోలులో ఎంపిక

కలెక్టరేట్(కాకినాడ), నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పెద్దాపురం, కాకినాడ రూరల్, గొల్లప్రోలులో ఇసుక స్టాక్ యార్డుల నిర్వహణకుగాను మొత్తం 22 టెండర్లను జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్‌మీనా స్వీకరించారు. శుక్రవారం కాకినాడ కలెక్టరేట్‌లో లాటరీ విధానంలో ముగ్గురిని ఎంపిక చేయనున్నారు. ఎంపిక కాబడిన కాంట్రాక్టర్లు ప్రభుత్వ నిబంధనలననుసరించి ఇసుక స్టాక్ యార్డులను నిర్వహించాలి. కాకినాడ రూరల్, పెద్దాపురం స్టాక్ యార్డుల్లో టన్ను ఇసుక రూ.600కి, గొల్లప్రోలు యార్డులో టన్ను ఇసుక రూ.582కి విక్రయించాలి. వీరు ఇసుకను తూర్పుగోదావరి జిల్లాలో కడియం మండలం వేమగిరి రీచ్ నుంచి, పెరవలి మండలంలోని తీపర్రు-3 రీచ్‌ల నుంచి తీసుకురావాల్సి ఉంది. ఈ రెండు రీచ్‌లను కాకినాడ జిల్లాకు కేటాయించారు. ఇసుక యార్డు నిర్వాహకులకు తీపర్రులో లోడింగ్ చార్జీలు టన్నుకు రూ.98, వేమగిరిలో లోడింగ్ చార్జీలు రూ.61.30 అవుతుంది. అయితే తర్వాత రవాణా, స్టాక్ యార్డు సెక్యూరిటీ, సీసీ కెమెరాల నిర్వహణ వంటి వాటికి మరికొంత వ్యయం అవుతుంది. ఈ నేపథ్యంలో కాకినాడ రూరల్, పెద్దాపురం ఇసుక యార్డుల్లో టన్ను రూ.600కి, గొల్లప్రోలు ఇసుక యార్డులో టన్ను రూ.582కి వినియోగదారులకు విక్రయించాలని నిర్ణయించారు. వినియోగదారులు ఆన్‌లైన్‌తోపాటు, స్వయంగా యార్డులకు వెళ్లి కొనుగోలు చేసేందుకు అవకాశం కల్పించారు. టెండర్లు ఖరారైన వెంటనే ఈ మూడు ఇసుక యార్డుల్లో ఉచిత ఇసుక విక్రయాలు ఆరంభమవుతాయి.


ఊడలతో విస్తరించిన ధనమ్మమర్రి

'కార్తీకం'లో సందర్శనీయ ప్రాంతం..

ధనమ్మమర్రి


భక్తులకు దర్శనమిచ్చే ధనమ్మ తల్లి

- సహపంక్తి భోజనాలకు ప్రతీతి
- కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా ధనమ్మతల్లి
- గోదావరి వరద నుంచి రక్షించాలని ముడుపులు
- సంతాన ప్రాప్తికి పసుపు ఊయలలు.. భక్తుల విశ్వాసం
- కార్తీక మాసంలో విందు, వినోదాలకు నిలయం


విందు భోజనాల కోసం ఏర్పాటు చేసిన రేకులషెడ్

అదొక ఆహ్లాదకర ప్రాంతం.. సహపంక్తి భోజనాలకు ఎంతో ప్రసిద్ధిగాంచింది. అక్కడ కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా ధనమ్మ తల్లిగా ఉంది. గోదావరి వరద నుంచి రక్షించాలని ఆ మర్రిచెట్టు కు భక్తులు ముడుపులు, సంతాన ప్రాప్తికి పసుపు ఊయలలు కడతారు.. కార్తీకంలో విందు, వినోదాలకు నిలయంగా నిలుస్తోంది. అదే మన ధనమ్మమర్రి..!.. ఈ ప్రాంత ప్రత్యేకత గురించి తెలుసుకుందాం..


మర్రిచెట్టుకు కట్టిన ముడుపులు

కపిలేశ్వరపురం/(ఆంధ్రజ్యోతి):

గౌతమీ నదీతీరాన వెలసిన ధనమ్మతల్లి

భక్తులు కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా, ఆడపడుచులకు ఆరాధ్యదైవంగా నీరాజనాలు అందుకుంటున్న శ్రీధనమ్మతల్లి అమ్మవారికి ఎంతో చరిత్రఉంది. డాక్టర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కపిలేశ్వరపురం మండలం కేదార్లంక, వీధివారిలంక గ్రామాల మధ్య పావన గౌతమీ నదీతీరాన ఒక మర్రి చెట్టు ఉంది. ఈ చెట్టు కింద మూడు దశాబ్దాల క్రితం ధనమ్మతల్లి అమ్మవారు వెలిసిందని ప్రజల ప్రగాఢ నమ్మకం. ఆనాటినుంచి ఈప్రాంతం ధనమ్మమర్రిగా వాడుకలోకి వచ్చింది.

ఆదివారాల్లో సందర్శకుల తాకిడి

ధనమ్మ అమ్మవారి జాతర ఉత్సవాలు ఏటా వైశాఖ శుద్ధ ద్వాదశి నుంచి నిర్వహిస్తుంటారు. ఈ జాతరకు కపిలేశ్వరపురం వంశస్థులు అమ్మవారికి సారె, చీరలు పంపడం ఆనవాయితీగా మారింది. యాత్రికులు సమర్పించే కానుకలతోనే నిత్య ధూప, దీప నైవేద్యాలు, ఉత్సవ నిర్వహణ జరుగుతుంది. దివంగత మాజీ కేంద్రమంత్రి ఎస్‌బీపీబీకే సత్యనారాయణ రావు విందులకు వచ్చే సందర్శకుల కోసం మం చి నీటి సౌకర్యం, వంటశాలలు, నామమాత్రపు అద్దెతో వంటసామాగ్రి ఏర్పాటు చేయించారు. కార్తీకమాసంలో ధనమ్మమర్రి భక్తులతో కిటకిటలాడుతుంటుంది. ప్రతి ఆదివారం సందర్శకుల తాకిడి అధికంగా ఉంటుంది.

మర్రిచెట్టు ఊడలతో..

కపిలేశ్వరపురం జమిందారు దివంగత బలుసు బుచ్చి సర్వారాయుడు వంశానికి చెందిన లంక భూమిలో ఈ మర్రిచెట్టు ఊడలతో విస్తరించి ఉంది. యాంత్రికమైన జనజీవనానికి ఆటవిడుపునిచ్చే విందు, వినోదాలు కాగా వాటికి విడిదిగా ప్రత్యేక ఖ్యాతి నార్జించింది ఈ ధనమ్మమర్రి. ఈ ప్రాంతం ఒకప్పుడు భక్తిప్రపత్తులకు మాత్రమే ఆలవాలంగా ఉండగా ఇప్పుడు అన్నిరకాల విందు, వినోదాలకు నిలయంగా మారింది. ఈ మధ్య కాలంలో ఇక్కడ పలువురు ఆకతాయిలు తీరు ఒక్కోసారి భక్తుల మనోభావాలను దెబ్బతీసేలా ఉండడంతో పలువురు ఇబ్బంది పడుతున్నారు. ఇక్కడ వరద గోదావరి నుంచి లంక పంటలను, బాలారిష్టాల నుంచి పిల్లలను రక్షించి పశుసంపద సమృద్ధిగా ఉండాలని అమ్మవారికి గ్రామస్థులతోపాటు యాత్రికులు ముడుపులు, మొక్కుబడులు చెల్లిస్తుంటారు. సంతాన ప్రాప్తి కలిగించమని పసుపు ఊయలలు కడతారు. బంధుగణాలతో సహపంక్తి భోజనాలు చేస్తుండడం అనాదిగా సాగుతోంది. అమ్మవారిని దర్శించడానికి లంక గ్రామాలతో పాటు పరిసర మండలాలైన కొత్తపేట, రావులపాలెం, కపిలేశ్వరపురం, మండపేట, సుదూర ప్రాంతాల నుంచి కూడా భక్తులు వస్తుంటారు.


రాయవరంలో వాలీబాల్ ఆడుతున్న క్రీడాకారులు (ఫైల్)

క్రీడా కోటా..

ఇకపై 3%

- 1 శాతం పెంచిన కూటమి ప్రభుత్వం
- క్రీడాకారులకు ప్రోత్సాహం
- ప్రభుత్వ ఉద్యోగాలకు సులువైన మార్గం
- క్రీడాకారుల్లో హర్షాతిరేకాలు

క్రీడల్లో రాణిస్తే చాలు.. మంచి అవకాశాలు లభించనున్నాయి. కూటమి ప్రభుత్వం ఉద్యోగాల్లో క్రీడా కోటాను 3శాతానికి పెంచుతూ నిర్ణయం తీసుకుంది. గతంలో 2శాతంగా ఉన్న ఈ కోటాను ఇప్పుడు 1శాతం పెంచడంతో 3శాతానికి పెరిగింది. దీంతో క్రీడారంగంలో రాణించే వారికి మేలు జరగనుంది. దీనివల్ల క్షేత్రస్థాయిలో క్రీడా పోటీలకు హాజరయ్యేవారికి మంచి అవకాశాలు లభించనున్నాయి. ఈ నిర్ణయంపై క్రీడాకారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రాయవరం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని అన్ని ప్రాంతాలనుంచి అనేకమంది క్రీడాకారులు క్రీడల్లో రాణిస్తున్నారు. రాష్ట్ర, జాతీయస్థాయికి ఎంపికవుతూ.. కొందరు అంతర్జాతీయ స్థాయిలోను సత్తాచాటుతున్నారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సైతం క్రీడకారులను క్రీడల్లో ప్రోత్సహిస్తున్నారు. నగరాలతోపాటు గ్రామీణప్రాంతాల్లో ఉన్న క్రీడాకారులు వారిలో దాగిఉన్న నైపుణ్యాన్ని వెలికితీసి జాతీయ, అంతర్జాతీయస్థాయిలో వారిని తీర్చిదిద్దాలని కూటమి ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. వైసీపీ హయాంలో కనీస సౌకర్యాలు కల్పించపోవడంతో క్రీడాకారులకు ప్రోత్సాహాలు లేకపోయాయి. కూటమి ప్రభుత్వం తిరిగి క్రీడలకు పూర్వవైభవం కల్పించి క్రీడాకారులను ప్రోత్సాహం అందజేయాలని నిర్ణయించింది. ముఖ్యమంత్రి చంద్రబాబు ఉద్యోగాల్లో క్రీడాకారుల కోటాను పెంచడంతో క్రీడలు మరింత అభివృద్ధి చెందడంతోపాటు క్రీడాకారులు అన్నిస్థాయిల్లోను రాణించడానికి ఎంతగానో ఉపకరిస్తుందని అభిప్రాయం వ్యక్తమౌతోంది. ఇప్పటివరకు క్రీడాకారులకు ఉద్యోగాల్లో ఉన్న రెండు శాతం ఉన్న క్రీడాకోటాను 3శాతానికి పెంచారు. గ్రామీణప్రాంతాల్లో అనేకమంది విద్యార్థులు ఇటీవల క్రీడల్లో రాణిస్తున్నారు. వాలీబాల్, క్రికెట్, ఖోఖో, కబడ్డీ, టెన్నిస్, అథ్లెటిక్స్ బాల్ బ్యాడ్మింటన్, యోగా, చెస్ వంటి క్రీడల్లో తమ సత్తా చాటుతున్నారు. పాఠశాలల్లో పీఈటీల ద్వారా శిక్షణ పొంది తమలోని నైపుణ్యాలను మెరుగుపర్చుకుంటున్నారు. కూటమి ప్రభుత్వం తీసుకున్న నూతన క్రీడా విధానంతో క్రీడలకు పూర్వ వైభవం వస్తుందని పలువురు క్రీడా నిపుణులు భావిస్తున్నారు.

మాకు మరింత ఉత్సాహాన్నిచ్చింది



చదువుతోపాటు క్రీడల్లో ఆసక్తి చూపుతూ క్రీడల్లో రాణిస్తున్న విద్యార్థులకు చంద్రబాబు ప్రభుత్వం పెంచిన 3శాతం కోటాతో మాకు క్రీడల్లో మరింత రాణించాలనే ఉత్సాహం కలుగుతోంది.

-కాకి రమ్యశ్రీ, బాల్ బ్యాడ్మింటన్ క్రీడాకారిణి

అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి



క్రీడల్లో 3శాతం కోటాను ప్రతి క్రీడాకారుడు సద్వినియోగం చేసుకోవాలి. ఈ నిర్ణయంతో పాఠశాలస్థాయిలో రాణిస్తున్న క్రీడాకారులను తీర్చిదిద్దడానికి మరింత అవకాశం కలిగింది.

-కృష్ణప్రసాద్, పీఈటీ వెదురుపాక(రాయవరం)

ముగిసిన నామినేషన్ల ఉపసంహరణలు

- ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బరిలో ఐదుగురు అభ్యర్థులు
- వచ్చేనెల 5న పోలింగ్.. 9న ఓట్ల లెక్కింపు

కలెక్టరేట్(కాకినాడ), నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల ఉపసంహరణలు గురువారం ముగిశాయి. ఒకే ఒక్క అభ్యర్థి నామినేషన్ ఉపసంహరణ చేసుకోగా ఎన్నికలబరిలో ఐదుగురు అభ్యర్థులు నిలిచారు. ఎన్నికల బరిలో నిలిచినవారిలో బుర్రా గోపిమూర్తి, గంథం నారాయణ రావు, నామన వెంకటలక్ష్మీ, కవల నాగేశ్వరరావు, పులుగు దీపక్ ఉన్నారు. ఇకనుంచి వీరు ఎన్నికల ప్రచారంలో నిమగ్నమవ్వనున్నారు. వచ్చేనెల 5న పోలింగ్ జరగనుంది. 9న కౌంటింగ్ జరగనుంది. దీనికి అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేస్తుంది. మొత్తంగా 16,316మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. దీనిలో అల్లూరి సీతారామరాజు జిల్లాలో 614మంది, తూర్పుగోదావరి జిల్లాలో 2893మంది , ఏలూరు జిల్లాలో 2605మంది, కాకినాడ జిల్లాలో 3333 మంది, కోనసీమ జిల్లాలో 3209మంది, పశ్చిమ గోదావరి జిల్లాలో 3662మంది ఓటర్లు ఉన్నారు. ఆరు జిల్లాల పరిధిలో 116 పోలింగ్ కేంద్రాలు ఉండగా, దీనిలో అల్లూరి సీతారామరాజు జిల్లాలో 12, తూర్పుగోదావరి జిల్లాలో 20, ఏలూరు జిల్లాలో 20, కాకినాడ జిల్లాలో 22, కోనసీమ జిల్లాలో 22, పశ్చిమగోదావరి జిల్లాలో 20 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి.

బోగన్‌విలియా... అందాలు!

కడియం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): పూలు అన్నా.. మొక్కలు అన్నా అందరికీ ఇష్టమే. అటువంటి మొక్కల పుట్టినిల్లు కడియం. కడియం నర్సరీల్లో వివిధ రకాల మొక్కలు మనకు లభ్యమవుతాయి. మనకు ఫొటోల్లో కనిపిస్తున్నవి బోగన్‌విలియా.. వీటినే కాగితం పూలు అని కూడా అంటారు. ఇంటిముందు, లాండ్ స్కేపింగ్‌లో అలంకరణకు ఎక్కువగా వీటిని వాడుతుంటారు. ఇనుప ఊచలను వివిధ ఆకృతుల్లో తయారు చేసి ఈ మొక్కలకు వాటిపై పాకిస్తూ తీర్చిదిద్దుతారు. ప్రస్తుతం సుందరీకరణలో వీటికి డిమాండ్ ఎక్కువగా ఉంది. ఈ బోగన్‌విలియా పూలమొక్కలు ఎరుపు, తెలుపు, పసుపు, నీలం, వైలట్ వంటి రంగుల్లో విడివిడిగా పలు రంగుల కలిసి ఒకే మొక్కగా కడియం నర్సరీల్లో ఇలా కొలువుతీరి ఉన్నాయి.




తూర్పుగోదావరి జిల్లాలోని కడియం నర్సరీల్లో రకరకాల రంగుల్లో కనువిందు చేస్తున్న బోగన్‌విలియా మొక్కలు.. అదేనండీ.. కాగితం పూల మొక్కలు

సాఫ్ట్‌బాల్ పోటీలకు పెద్దాపురప్పాడు విద్యార్థుల ఎంపిక


ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం, పీడీ

కరప, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు కాకినాడ జిల్లా కరప మండలం పెద్దాపురప్పాడు హైస్కూల్‌కు చెందిన పలువురు విద్యార్థులు ఎంపికైనట్టు హెచ్‌ఎం ఎస్ఎస్ఎస్ఎస్ శ్రీనివాస్, పీడీ బీవీ వీఎస్‌వీ ప్రసాద్ తెలిపారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఐ.పోలవరం మండలం జి.వేమవరం హైస్కూల్ క్రీడాప్రాంగణంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్, విద్యాశాఖ ఆధ్వర్యంలో ఎంపిక ప్రక్రియ జరిగిందని గురువారం వారు తెలిపారు. అండర్-14 విభాగంలో బాలురజట్టుకు పాఠశాలనుంచి ఎన్.నాగేంద్ర, బి.అంజనీకుమార్, బాలికల జట్టుకు సీహెచ్.విజయలక్ష్మి, కె.అనురాధ ఎంపికయ్యారన్నారు. చిత్తూరుజిల్లా అరకొండలో ఈనెల 22వ తేదీ నుంచి జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా జట్ల తరపున వీరు ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. అండర్-17 విభాగంలో బాలుర జట్టుకు వై.సుధీర్, డి.సూర్యవెంకటమణికంఠ, జి.వీరమణికుమార్, బాలికల జట్టుకు కె.సంధ్యారాణి ఎంపికయ్యారన్నారు. అనంతపురంలో ఈనెల 23 నుంచి జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా జట్ల నుంచి వీరు బరిలోకి దిగుతారని వివరించారు. క్రీడాకారులను, పాఠశాల పీడీ ప్రసాద్‌లను హెచ్‌ఎం తోపాటు సర్పంచ్ బిరుదా సరస్వతి, ఉపసర్పంచ్ శ్రీనివాసఅప్పారావు, విద్యాకమిటీ చైర్మన్ యాళ్ల నాగబాబు అభినందించారు.

పీసా చట్టం అమలుపై ముగిసిన శిక్షణ


సర్టిఫికెట్లు పొందుతున్న శిక్షణార్థులు

సామర్లకోట, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): సామర్లకోట విస్తరణ శిక్షణ కేంద్రం ఆవరణలో రెండురోజులుగా నిర్వహిస్తున్న గిరిజన ప్రాంతాల్లో పీసా చట్టం అమలుపై ప్రభుత్వం నిర్దేశించిన మేరకు చట్టం అమలులో నిష్ణాతులు ఇచ్చిన శిక్షణ తరగతులు గురువారంతో ముగిశాయి. ప్రిన్సిపాల్ జె.వేణుగోపాల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిక్షణా తరగతుల్లో వైస్ ప్రిన్సిపాల్ కృష్ణమోహన్ మాట్లాడుతూ పీసా చట్టం 1996లో కేంద్రప్రభుత్వం అమలులోకి తీసుకొచ్చిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా ఈ చట్టాన్ని అమలు చేసేందుకు గ్రామ పరిపాలనా వ్యవస్థలో ఈచట్టం ఆవశ్యకతను సమగ్రంగా వివరించారు. కార్యక్రమంలో జేడీలు రమణ, రామనాథం మాట్లాడుతూ పీసా చట్టం అమలుకు పంచాయతీరాజ్‌శాఖ, గిరిజనశాఖ, జీసీసీ, ఎక్సైజ్‌శాఖ, పోలీసుశాఖలు భాగస్వాములు కావాలన్నారు. ఫ్యాకల్టీలు సీతారామారావు, వి.ప్రసాద్, కేఆర్ నీహారిక, బి.ఆంజనేయులు, డీఆర్ఎల్ పద్మరాజు ప్రసంగించారు. శిక్షణార్థులకు సర్టిఫికెట్లు, ప్రశంసాపత్రాలు అందజేశారు.

'బాలికల సంరక్షణకు అందరూ భాగస్వాములవ్వాలి'

- ఏపీ బాలల హక్కుల కమిషన్ సభ్యురాలు టి.ఆదిలక్ష్మి

సామర్లకోట, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): బాలికల సంరక్షణకు సమాజంలో అందరూ భాగస్వాములవ్వాలని, ఇందుకు చట్టాలను సద్వినియోగం చేసుకోవాలని ఏపీ బాలల హక్కుల కమిషన్ సభ్యురాలు టి.ఆదిలక్ష్మి అన్నారు. సామర్లకోట టీటీడీసీ ఆవరణలో గురువారం కిశోర వికాసం పేరిట కాకినాడ జిల్లాస్థాయి శిక్షకుల శిక్షణా కార్యక్రమాన్ని పీడీ శ్రీరమణి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఐసీడీఎస్ కాకినాడ జిల్లా పీడీ కె.ప్రవీణ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా హాజరైన రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యురాలు టి.ఆదిలక్ష్మి మాట్లాడారు. కిశోరబాలికల సంరక్షణకు ఆరుశాఖలను మిళితం చేశారని, ఇందుకు జిల్లాస్థాయి రీసోర్సు గ్రూపుల ద్వారా మండల రీసోర్సుగ్రూప్‌లకు శిక్షణ ఇవ్వాల్సి ఉందన్నారు. పాఠశాలలకు, కళాశాలలకు వెళ్లని బాలికలను గ్రూపులుగా మహిళా పోలీసు, వెల్ఫేర్, ఎడ్యుకేషన్ అసిస్టెంట్‌లుగా ఏర్పాటు చేయాలని సూచించారు. కిశోర బాలికా వికాసం కార్యక్రమానికి సంబంధించి నవంబరు 30లోగా విలేజ్ రీసోర్సు గ్రూపులకు మండల రీసోర్సు శిక్షణలు పూర్తి చేయాలన్నారు. డీఆర్డీఏ ఇన్‌చార్జి పీడీ శ్రీరమణి మాట్లాడుతూ కిశోర వికాసం కోసం ఏర్పాటు చేసిన గ్రూపులు ప్రతి 15రోజులకు ఒకసారి(రెండో, నాలుగో శనివారాల్లో) అంగన్‌వాడీ కేంద్రాల్లో సమావేశం అవ్వాలని సూచించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ ప్రవీణ మాట్లాడుతూ లింగవివక్షత, సంపూర్ణ ఆహారం-ఆరోగ్యం, నాణ్యమైన విద్య, వ్యక్తిగత రుతుస్రావ పరిశుభ్రత, లైంగిక వేధింపులనుంచి రక్షణ, బాల్యవివాహాలను అరికట్టడం, మానవ అక్రమ రవాణా, ఆత్మరక్షణ, నైపుణ్యం ఉపాధి వంటి అంశాలపై సమగ్రంగా వివరించారు. పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు, సీఐ అంకబాబు, చైల్డ్‌లైన్ కోఆర్డినేటర్ వెంకట్, శ్రీనివాస్‌లు ప్రసంగించారు. పడాల చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధి సూర్య ప్రసాదరావు, మున్సిపల్ కమిషనర్ శ్రీవిద్య ప్రసంగించారు. బాలలకు ఆపద సమయంలో 1098, 112 టోల్ ఫ్రీ నెంబర్లకు ఫోన్ ద్వారా సమాచారాన్ని అందించి రక్షణ పొందవచ్చని చారిటబుల్ ట్రస్ట్ తరపున చిరంజీవి విజయలక్ష్మి పప్పెట్‌లతో కూడిన సందేశాన్నిచ్చారు. శిక్షణ తరగతుల్లో పలు ఐసీడీఎస్ ప్రాజెక్టుల సీడీపీవోలు ఉషా, దుర్గాదేవి, శ్రీలలిత, మెప్మా అధికారులు పాల్గొన్నారు.

అసంపూర్తి భవనాలు పూర్తికి చర్యలు

- వచ్చేనెల 6నుంచి ఇంటర్మీడియట్‌కు రెండు పూటలా తరగతులు
- విద్యాశాఖ ఆర్‌జేడీ శారద


ఆర్‌జేడీ శారదను సత్కరిస్తున్న ప్రిన్సిపాల్ కేశవరావు

పిఠాపురం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ కళాశాలలో అసంపూర్తిగా ఉన్న భవనాలను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామని ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ ఆర్‌జేడీ ఐ.శారద తెలిపారు. గురువారం ఆమె కాకినాడ జిల్లా పిఠాపురం పట్టణంలోని ఆర్ఆర్‌బీహెచ్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. కళాశాలలో బోధన జరుగుతున్న తీరు, ఇతర సౌకర్యాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కళాశాలలో నాబార్డు ద్వారా చేపట్టిన కళాశాల భవనాలు మధ్యలో నిలిచిపోయిన విషయాన్ని ప్రిన్సిపాల్ కేశవరావు, కళాశాల పీటీఏ చైర్మన్ విజయకుమార్ తదితరులు ఆర్‌జేడీ దృష్టికి తీసుకువచ్చారు. దీనితో ఆమె అక్కడినుంచే ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ కృతికాశుక్లాతో ఫోన్‌లో మాట్లాడారు. కళాశాల ఎక్యులేటెడ్ ఫీ ఫండ్ నుంచి రూ.30.5లక్షలతో అసంపూర్తిగా ఉన్న భవనాలు పూర్తి చేయించేందుకు డైరెక్టర్‌తో అంగీకరింప చేశారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవనాలు పూర్తయినందున త్వరితగతిన సొంత భవనాల్లోకి వెళ్లాలని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌కు సూచించారు. ఇంటర్మీడియట్ తరగతులను డిసెంబరు 6వ తేది నుంచి రెండు పూటలా తరగతుల నిర్వహణకు ఉత్తర్వులు ఇస్తామని తెలిపారు. అనంతరం ఆర్‌జేడీని ప్రిన్సిపాల్ తదితరులు సత్కరించారు.

108 శివలింగాలతో 25న పాదగయలో లక్షార్చన

పిఠాపురం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురంలోని పాదగయ క్షేత్రంలో రాజరాజేశ్వరీ సమేత ఉమాకుక్కుటేశ్వరస్వామి సన్నిధిలో ఈనెల 25వతేదీ రాత్రి 108 శివలింగాలతో లక్షార్చనపూజ నిర్వహించనున్నారు. ఘనాపాఠి ద్విభాష్యం సుబ్రహ్మణ్యశర్మ ఆధ్వర్యంలో జరిగే ఈ పూజా కార్యక్రమాల్లో భాగంగా పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు జరుగుతాయని శివస్వాముల భక్త బృందం సభ్యులు తెలిపారు. శివస్వాములతోపాటు అయ్యప్ప, దత్తస్వాములు, ఇతర మాలదారులు ఈ పూజల్లో పాల్గొనాలని వారు కోరారు.

అంతర్వేదిలో దేవదాయశాఖ డిప్యూటీ కమిషనర్ పూజలు


రమేష్‌బాబుకు స్వామి చిత్రపటం అందిస్తున్న దృశ్యం

అంతర్వేది, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): అంతర్వేదిలో కొలువై ఉన్న శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయానికి దేవదాయ, ధర్మదాయశాఖ కాకినాడ డిప్యూటీ కమిషనర్ డీవీవీ రమేష్‌బాబు గురువారం విచ్చేశారు. ఆయనకు ఆలయ ఏసీ, అర్చకులు ఘనస్వాగతం పలికారు. స్వామివారి అంతరాలయంలో దర్శనం నిర్వహించి వేదపండితులతో మహదాశీర్వచనం జరిపించారు. వారికి స్వామివారి చిత్రపటం, ప్రసాదాలను ఏసీ సత్యనారాయణ అందించారు.



రమణ దీక్షితులును సత్కరిస్తున్న పోలరాజు

శివాంజనేయ నర్సరీని సందర్శించిన రమణ దీక్షితులు

కడియం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి జిల్లా కడియం మండలం కడియపులంకలోని శివాంజనేయ నర్సరీని తిరుమల తిరుపతి దేవస్థానం మాజీ ప్రధానార్చకుడు రమణ దీక్షితులు గురువారం సందర్శించారు. ఆయనకు నర్సరీ అధినేత, నర్సరీ సంఘం అధ్యక్షుడు మల్లు పోలరాజు మొక్క అందజేసి స్వాగతించి సత్కరించారు. రమణ దీక్షితులు నర్సరీలో వివిధ రకాల మొక్కలను చూసి సంతోషం వ్యక్తం చేశారు. కొన్ని రకాల ఆయుర్వేద మొక్కల గురించి అడిగారు. బోన్సాయ్ మొక్కలను చూసి అబ్బురపడ్డారు.



హుండీల్లో వచ్చిన కానుకలను లెక్కిస్తున్న దృశ్యం

సిద్ధి వినాయకుని హుండీల ఆదాయం రూ.29.70 లక్షలు

అయినవిల్లి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అయినవిల్లి శ్రీవిఘ్నేశ్వరస్వామి ఆలయంలో హుండీలను గ్రేడ్-1 పర్యవేక్షణాధికారి ఎం.రాధాకృష్ణ ఆధ్వర్యంలో గురువారం తెరిచి లెక్కించారు. ప్రధాన హుండీల ద్వారా రూ.28,57,346, అన్నప్రసాద హుండీ ద్వారా రూ.1,13,365.. మొత్తం రూ.29.70 లక్షలు వచ్చిందన్నారు. బంగారం 7 గ్రాములు, వెండి 743 గ్రాములు, 19 విదేశీ కరెన్సీ లభించాయని ఆలయ సహాయ కమిషనరు, ఈవో ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు. లెక్కింపులో అర్చకులు, ఆలయ సిబ్బంది, గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.



స్వామీజీకి చిత్రపటం అందజేస్తున్న సహాయ కమిషనర్ సత్యనారాయణ

లక్ష్మీనరసింహుని సన్నిధిలో మేల్కొట క్షేత్రాధిపతి

అంతర్వేది, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండలం అంతర్వేదిలో కొలువైయున్న శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయానికి కర్ణాటక రాష్ట్రం మేల్కొట క్షేత్రాధిపతి త్రిదండి శఠగోపమునిరామరాజ్ జీయర్‌స్వామి గురువారం విచ్చేశారు. ఆయనకు ఆలయసహాయ కమిషనర్ వి.సత్యనారాయణ, స్థానాచార్యులు రామరంగాచార్యులు స్వాగతం పలికారు. స్వామివారి దర్శనం అనంతరం వేద పండితులు మహదాశీర్వచనం ఇచ్చారు. ఆలయ అధికారులు స్వామివారి చిత్రపటాన్ని జీయర్‌స్వామికి అందించారు.



గిరిజన రైతులతో కలిసి కోసిన పత్తిని చూపిస్తున్న విదేశీ శాస్త్రవేత్తలు

మన్యంలో నెదర్లాండ్స్ శాస్త్రవేత్తలు

ప్రకృతి వ్యవసాయంపై పరిశోధన

చిన్నయపాలెంలో పత్తి సాగు పరిశీలన

రాజవొమ్మంగి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయ సాగుపై పరిశోధన చేస్తున్న నెదర్లాండ్స్ దేశానికి చెందిన అవన్స్ యూనివర్సిటీ శాస్త్రవేతల బృందం గురువారం అల్లూరి సీతారామరాజు జిల్లా రాజవొమ్మంగి మండలంలో పర్యటించింది. చిన్నయపాలెం గ్రామంలో రాడీస్ సంస్థ ప్రోత్సాహంతో ప్రకృతి వ్యవసాయం ద్వారా గిరిజన రైతు గూడెం బాలమ్మ సాగు చేస్తున్న పత్తి పంటను శాస్త్రవేత్తలు కరిన్ జసీన్, తహసీమార్క్, టిమీర్ మన్స్, ఎల్స్‌డిరిద్దర్ పరిశీలించారు. ప్రకృతి వ్యవసాయాన్ని పెంచేందుకు ప్రత్యేక ప్రణాళికతో ముందుకు వెళుతున్నామని, రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించేందుకు కృషి చేస్తున్నామని రాడీస్ సంస్థ వ్యవస్థాపకుడు అనిల్‌కుమార్ శాస్త్రవేత్తల బృందానికి వివరించారు. ఒకే పంటపై ఆధారపడకుండా పత్తి సాగు చేసే ఎకరంలోనే అంతర పంటలుగా బొబ్బర్లు, కందులు, చోళ్లు పండించడంపై శాస్త్రవేత్తలు ప్రత్యేక ఆసక్తి కనబర్చారు. పంటలకు చీడపురుగులు పట్టకుండా పొలం చుట్టూ వేసిన ఆముదం మొక్కలను పరిశీలించారు. గిరిజన రైతులతో కలిసి పత్తిని తీశారు.




సత్యదీక్షాపరుల ఇరుముడి సమర్పణకు ఏర్పాటుచేసిన హోమ గుండం

నేడు రత్నగిరిపై సత్య అనుగ్రహ పూజ

రేపు సత్య దీక్షల విరమణకు ఏర్పాట్లు పూర్తి

సత్యదీక్షాపరులందరికీ ఉచిత సామూహిక సత్యనారాయణ వ్రతాలు

అన్నవరం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): రత్నగిరివాసుడైన సత్యదేవుని సన్నిధిలో శుక్రవారం సాయంత్రం ఆరు గంటలకు సత్య అనుగ్రహ (పడి) పూజ నిర్వహణకు అధికారులు శరవేగంగా ఏర్పాట్లు చేస్తున్నారు. సత్యదేవుని వార్షిక కల్యాణ మండపంలో నిర్వహించే పూజలో సత్యదీక్షాపరులు, అయ్యప్పమాలధారులు పాల్గొననున్నారు. స్వాములంతా కల్యాణ వేదిక ఎదురుగా కూర్చునేందుకు బారికేడ్లు, క్యూలైన్లు ఏర్పాటు చేస్తున్నారు. ఆరు గంటలకు ప్రారంభమయ్యే పడి పూజ రాత్రి 10.30 వరకు జరుగుతుంది. దీక్షాపరులందరికీ దేవస్థానం ఆధ్వర్యంలో అల్పాహారం ఏర్పాటు చేస్తున్నట్టు అధికారులు తెలిపారు. శనివారం సత్యదీక్షల విరమణకు సంబంధించి పనులు వేగవంతమయ్యాయి. గిరిజన ప్రాంతంలో పవనగిరి స్వామీజీ ఆధ్వర్యంలో దీక్షలు చేపట్టిన వారు, సత్యదీక్ష ప్రచారకర్త కృష్ణబాబు ఆధ్వర్యంలో దీక్ష తీసుకున్న వారు శుక్రవారం రాత్రి అన్నవరం చేరుకుంటారు. సత్యదీక్షాపరులు అందరూ వార్షిక కల్యాణ మండపంలో ఇరుముడులు సమర్పించాలి. దీనికి సంబంధించి కల్యాణ వేదికను అనుకుని ప్రత్యేక హోమ గుండం ఏర్పాటు చేశారు. సత్యదీక్షలు విరమించే అందరికీ సత్యనారాయణ స్వామి ఉచిత సామూహిక వ్రతాల నిర్వహణకు ప్రత్యేకంగా రెండు వ్రత మండపాలను అందుబాటులో ఉంచినట్టు ఆలయ సహాయ కమిషనరు సీహెచ్ రామ్మోహనరావు చెప్పారు.



పోలీస్ గెటప్‌లో ఉన్న ఫొటోతో వచ్చిన వాట్సాప్ కాల్

కరప తరహాలో ఘరానా మోసం

మీ కుమార్తెను అరెస్ట్ చేశామంటూ వాట్సాప్ కాల్‌తో బెదిరింపు

తండ్రి గట్టిగా ప్రతిఘటించడంతో తోక ముడిచిన సైబర్ మోసగాడు

పి.గన్నవరం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కరప గ్రామంలో సైబర్ ఘటన జరిగి రెండు రోజులు గడవక ముందే డాక్టర్ బీఆర్ అంబేడర్ కోనసీమ జిల్లా పి.గన్నవరంలో అదే తరహాలో అదే పోలీస్ యూనిఫామ్‌లో ఉన్న ఫొటోతో వాట్సాప్ కాల్ ద్వారా..... మీ కుమార్తెను అరెస్ట్ చేశామని తండ్రి మొబైల్‌కు ఫోన్ చేసి బెదిరించాడు ఓ సైబర్ మోసగాడు. వివరాలు ఇలా ఉన్నాయి... గన్నవరం గ్రామానికి చెందిన బోరుసు చంద్రశేఖర్ దంపతులు హైదరాబాద్‌లో ఒక వివాహ వేడుకకు హాజరై గురువారం ఉదయం ఇంటికి వచ్చారు. ఈ క్రమంలో ఉదయం 9.45 గంటల సమయంలో పోలీస్ యూనిఫామ్, వెనుక పోలీస్ స్టేషన్ సెటప్‌తో కూడిన ఫొటోతో చంద్రశేఖర్‌కు వాట్సాప్ కాల్ వచ్చింది. మొదటిసారి తియ్యకపోవడంతో మళ్లీ కాల్ వచ్చింది. ఫోన్ తియ్యగానే క్రైమ్ బ్రాంచ్ నుంచి సీబీఐ అధికారిని మాట్లాడుతున్నానని చెప్పాడు. రాజమహేంద్రవరంలో డెంటల్ కాలేజీలో పీజీ చేస్తున్న ఆయన కుమార్తె పేరు చెప్పి అరెస్ట్ చేశామని, ప్రస్తుతం మా వద్ద ఉందని సైబర్ మోసగాడు చెప్పాడు. దీంతో కంగుతున్న చంద్రశేఖర్ ఇదేంటి గంట క్రితమే కుమార్తెతో మాట్లాడాను కదా అప్పుడే అరెస్ట్ అంటున్నారేంటి అనుకుని ఒక్క క్షణం దిగ్భ్రాంతికి గురై అనంతరం ఫోన్‌లో గట్టిగా ప్రతిఘటించాడు. దీంతో ఆ సైబర్ మోసగాడు ఫోన్ కట్ చేసి తోక ముడిచాడు. కాగా వీరిద్దరి మధ్య సంభాషణ ఇంగ్లీషులోనే జరిగింది. ఈ రకమైన ఫోన్ కాల్స్ వచ్చినప్పుడు ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించాలని పోలీసులు చెప్తున్నారు. తొందరపడి నిర్ణయం తీసుకుంటే ఇబ్బందిపడతారని హెచ్చరిస్తున్నారు.

ఇద్దరు దారి దోపిడీ దొంగల అరెస్టు

31.5 గ్రాముల బంగారపు వస్తువులు, ఐదు వేల నగదు స్వాధీనం



అరెస్టు చేసిన నిందితుల వివరాలు వెల్లడిస్తున్న ఏలూరు డీఎస్పీ శ్రావణ్‌కుమార్

ఏలూరు క్రైం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై రాత్రి వేళ దారిదోపిడీకి పాల్పడుతున్న ఇద్దరు దొంగలను అరెస్టు చేశామని ఏలూరు డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్ చెప్పారు. డీఎస్పీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈ నేరస్తుల వివరాలను ఆయన వెల్లడించారు. ఈ సమావేశంలో డీఎస్పీతో పాటు భీమడోలు సీఐ యుజే విల్సన్, ద్వారకాతిరుమల ఎస్ఐ పి.సుధీర్ పాల్గొన్నారు. డీఎస్పీ మాట్లాడుతూ దేవరపల్లి మండలం చిన్నాయిగూడెం గ్రామానికి చెందిన ఆలూరి శాంతకుమార్ ఈ ఏడాది ఏప్రిల్ 25వ తేదీ రాత్రి భీమడోలులో ఉన్న తన భార్య వద్దకు మోటారు సైకిల్‌పై వస్తున్నాడు. మార్గమధ్యంలో ద్వారకాతిరుమల మండలం కప్పలగుంట గ్రామ సమీపంలో జాతీయ రహదారిపై గల ఒక కల్వర్టు వద్ద ఆగాడు. అక్కడ పొలాల్లో దాగి ఉన్న ఇద్దరు యువకులు అకస్మాత్తుగా దాడి చేసి 10 వేల రూపాయల నగదు, సెల్‌ఫోన్, బంగారపు ఉంగరాలను లాక్కొని అతని కాళ్లు, చేతులు కట్టి చెట్ల పొదల్లో పడవేసి పారిపోయారు. ఈ సంఘటనపై ద్వారకా తిరుమల పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించారు. ఈ దోపిడీకి పాల్పడిన ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేశారు. వారి నుంచి ఐదు వేల రూపాయల నగదు ఒక బంగారపు ఉంగరం, టార్చిలైట్, ఈ నేరానికి ఉపయోగించిన ఆటోను సీజ్ చేశారు. అరెస్టు అయిన నిందితులు రాజమహేంద్రవరం కొంతమూరులోని జంగాలకాలనీకి చెందిన మానిపాటి విజయ్‌కుమార్ (24) రాజమహేంద్రవరంలోని చింతల నామవరానికి చెందిన రామిరెడ్డి త్రిమూర్తులును అరెస్టు చేశామన్నారు. మానిపాటి విజయ్ కుమార్ అనేక దోపిడీలు, దొంగతనాలకు పాల్పడ్డాడని తెలిపారు. పోలీసులు అరెస్టు చేసిన ఇద్దరు నిందితుల నుంచి 31.500 గ్రాముల బంగారం (ఏడు ఉంగరాలు, రెండు గొలుసులు) ఒక టార్చిలైటు, ఐదు వేల రూపాయల నగదు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. అరెస్టు చేసిన పోలీసుల్ని ఎస్పీ అభినందించారు.



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న సీఐ తిలక్

దుబాయ్ వెళ్లి అప్పులపాలు... తీర్చేందుకు చోరీల బాట

తొలి చోరీ సక్సెస్ కావడంతో మరో చోరీకి యత్నం

నిడదవోలు పోలీసుల నిఘా.. ముగ్గురి అరెస్టు

నిడదవోలు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): వేర్వేరు ప్రాంతాలకు చెందిన ఇద్దరు అప్పులు చేసి దుబాయ్ వెళ్లారు... అక్కడ కలిశారు... ఒకరి కష్టాలు ఒకరికి చెప్పుకుని స్నేహితులుగా మారారు.. ఇండియా వచ్చాక ఆ అప్పులు తీర్చుకునేందుకు దొంగతనాలకు తెరలేపారు. వృద్ధురాలిపై దాడి చేసి బంగారం చోరీ చేసిన కేసులో పోలీసులకు చిక్కి జైలుకెళ్లారు. పశ్చిమ గోదావరి జిల్లా భీమవరానికి చెందిన చెల్లుబోయిన సత్యనారాయణ, తూర్పు గోదావరి జిల్లా పెరవలి మండలానికి చెందిన పాకా వీరాస్వామి అప్పులు చేసి దుబాయ్ వెళ్లారు. అక్కడ ఇద్దరూ ఒకే రూమ్‌లో కలిసి ఉండేవారు. దీంతో స్నేహితులయ్యారు. దుబాయ్‌లో వచ్చే ఆదాయం సరిపోకపోవడంతో ఇటీవల తిరిగి ఇండియాకు వచ్చేశారు.. అయితే అప్పులు తీర్చే మార్గం కానరాలేదు. మరోవైపు చెడు వ్యసనాలు.. దీంతో పాకా వీరాస్వామి ఉల్లిపాయల వ్యాపారం మొదలెట్టారు. ఈ నెల 6వ తేదీన నిడదవోలు గాంధీనగర్‌లో ఒక వృద్ధురాలు ఒంటరిగా నివసించడం గమనిం చాడు. ఈ విషయం స్నేహితుడు సత్యనారా యణకు చెప్పాడు. వృద్ధురాలిపై దాడి చేసి బంగారం ఎత్తుకుపోయేలా ప్లాన్ వేశారు. ఇందుకు పశ్చిమ గోదావరి జిల్లా ఉండి మండ లానికి చెందిన మరో స్నేహితుడు సమ్మింగి సన్యాసిరావు సహాయం తీసుకున్నారు. ఒంట రిగా ఉంటున్న వృద్ధురాలు నూలి అన్నపూర్ణమ్మ పై ఈ నెల 8వ తేదీన దాడి చేసి బంగారం దోచుకుపోయారు. ఇది సక్సెస్ కావడంతో బుధవారం మళ్లీ మరో నేరం చేయడానికి ప్రణాళిక వేసేందుకు నిడదవోలు రాగా పోలీసుల నిఘా ఉంచి పట్టుకున్నారు. చోరీ చేసిన బంగారాన్ని సీఐ తిలక్, ఎస్ఐ శోభన్‌కుమార్ రికవరీ చేశారు. ముగ్గురు నిందితులను అరెస్టు చేసి గురువారం కోర్టులో హాజరుపరిచారు.

అన్నవరం దేవస్థానంలో నిత్య హరినామ సంకీర్తనలు ఏర్పాటు చేయాలి

అన్నవరం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): టీటీడీ మాదిరిగా అన్నవరం దేవస్థానంలో నిత్య హరినామ సంకీర్తనల ఏర్పాటుకు అవకాశం కల్పించాలని కాకినాడ జిల్లా భజన కళాకారుల సంఘం కన్వీనర్ సాన నూకరాజు డిమాండ్ చేశారు. ప్రతి నిత్యం నాలుగు భజన బృందాలకు అవకాశం కల్పించి వారికి టీఏ, డీఏలతో పాటు గౌరవ వేతనం ఇవ్వాలన్నారు. అంతకు ముందు అన్నమయ్య కళాక్షేత్రం పీఠాధిపతి విజయశంకర స్వామీజీ ఆధ్వర్యంలో సుమారు 100 మంది ఆధ్యాత్మిక భజన సమ్మేళనం నిర్వహించి డిసెంబరు 11న జరిగే గీతా జయంతికి సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో స్వామి నిర్భయానంద గురూజీ పాల్గొన్నారు.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న భజన సమ్మేళన బృందం సభ్యులు

సత్యదేవ నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం

రత్నగిరిపై ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న సత్యదేవ నిత్యాన్నదాన పథకానికి గురువారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేటకు చెందిన పుట్టా గనిరాజు రూ.1,01,116 విరాళంగా సమర్పించారు. ఈ మొత్తాన్ని ఏఈవో కొండలరావుకు అందించారు. దాతను ఆయన అభినందించి ప్రత్యేక దర్శనం కల్పించి స్వామివారి ప్రసాదం అందజేశారు.



ఏఈవో కొండలరావుకు విరాళం అందజేస్తున్న దాత గనిరాజు

భావనారాయణస్వామిని దర్శించుకున్న ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకుడు హర్షవర్ధన్

సర్పవరం జంక్షన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): రాజ్యలక్ష్మీ సమేత భావనారాయణ స్వామిని ఐఏఎస్ అధికారి, ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకుడు హర్షవర్ధన్ గురువారం సాయంత్రం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ప్రధానార్చకుడు ఆలయ లాంఛనాలతో స్వాగతం పలికి ఆశీర్వదించారు. ఆలయంలోని పలు పురాతన ప్రాంతాలను సందర్శించారు. ఆలయ విశిష్టత, చరిత్రను అధికారులు వివరించారు. ప్రసాదం, స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు.



రేషన్ బియ్యం అక్రమాలను మంత్రికి వివరిస్తున్న టీడీపీ నాయకుడు శ్రీకాంత్

రేషన్ బియ్యం దందాపై చర్యలు తీసుకోండి

పౌరసరఫరాల శాఖ మంత్రి మనోహర్‌కు ఫిర్యాదు

ఎటపాక, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): చింతూరు డివిజన్ కేంద్రంగా సాగుతున్న రేషన్ బియ్యం దందాపై చర్యలు తీసుకోవాలని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌కు టీడీపీ నాయకులు నలజాల శ్రీకాంత్ చౌదరి, గడేసుల రంజిత్ ఫిర్యాదు చేశారు. గురువారం వారు అమరావతిలోని సచివాలయంలో మంత్రిని కలిశారు. నాలుగు విలీన మండలాలతో పాటు తెలంగాణలోని భద్రాచలం నుంచి రేషన్ బియ్యాన్ని అక్రమంగా చింతూరు తరలిస్తున్నారని... అక్కడి నుంచి రాజమహేంద్రవరం, కాకినాడలతో పాటు ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేస్తున్నారని చెప్పారు. ప్రభుత్వం పేదలకు అందించే రేషన్ బియ్యాన్ని వ్యాపారస్తులు తక్కువ ధరకు కొనుగోలు చేసి వాటిని కొన్ని రకాల రసాయనాలతో పాలిష్ చేస్తూ బ్లాక్ మార్కెట్‌లో కిలో రూ.60 నుంచి రూ.70 వరకు వరకు విక్రయిస్తూ సొమ్ములు చేసుకుంటున్నారన్నారు. దీనికి స్పందించిన మంత్రి మనోహర్ విచారణకు ఆదేశించి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్టు శ్రీకాంత్ చెప్పారు. మంత్రిని కలిసిన వారిలో బీజేపీ సోషల్ మీడియా కో-ఆర్డినేటర్ నలజాల శ్యామ్ వున్నారు.

'అపార్' అప్డేషన్‌పై డీఎల్డీవో సమీక్ష

సామర్లకోట, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): సామర్లకోట మండలంలో అపార్-ఆధార్ అప్డేషన్‌పై అమలు తీరుపై డీఎల్డీవో పి.వాసుదేవరావు మండల పరిషత్ కార్యాలయంలో అధికారులు, సిబ్బందితో కలిసి గురువారం సాయంత్రం సమీక్షించారు. ఎంపీడీవో హిమమహేశ్వరి, ఎంఈవోలు పుల్లయ్య, శివరామకృష్ణయ్య పాల్గొన్నారు. ఎస్సీసీఐ ఇంటింటా జియో ట్యాగింగ్ వేగవంతం చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా మం డలంలో వివిధ పథకాల అమలు తీరుపై డీఎల్డీవో వాసు దేవరావుకు ఎంపీడీవో హిమమహేశ్వరి వివరించారు.

కాకినాడ

• కాకినాడ సిటీ • రూరల్ • పిఠాపురం • పెద్దాపురం

కళావిహీనంగా మునిసిపల్ పార్కు

● నిర్వహణ లోపంతో అధ్వానం
● ఆహ్లాదాన్ని ఆస్వాదించలేకపోతున్న ప్రజలు
● పట్టించుకోని మున్సిపల్ అధికారులు



పిచ్చి మొక్కలతో అధ్వానంగా తయారైన మున్సిపల్ పార్కు



చెరువులో కూరుకుపోయిన బోట్లు

పెద్దాపురం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : పట్టణ ప్రజలకు ఆహ్లాదాన్ని పంచేందుకు ఏర్పాటుచేసిన మున్సిపల్ పార్కులు కళావిహీనంగా తయారయ్యాయి. కాసేపు కుటుంబ సభ్యులతో వచ్చి కాలక్షేపం చేద్దామనుకున్న ప్రజలకు నిరాశ ఎదురవుతోంది. దీంతో ప్రజలు మున్సిపల్ అధికారుల తీరును బహిరంగానే విమర్శిస్తున్నారు. స్థానిక గుర్రాల సెంటర్ వద్ద ఉన్న మున్సిపల్ పార్కు నిర్వహణ లోపంతో అధ్వానంగా తయారైంది. గడచిన టీడీపీ ప్రభుత్వ హయాంలో ఇక్కడ ఉన్న రెవెన్యూ చెరువును రూ.30లక్షల వ్యయంతో పార్కుగా తీర్చిదిద్దారు. వాకింగ్ ట్రాక్, ఓపెన్ జిమ్, ఎన్టీఆర్ విగ్రహం, బోట్ షికారు చేసేందుకు బోట్లు ఏర్పాటుచేశారు. ఆ తరువాత వైసీ పీ అధికారం చేపట్టిన తరువాత పార్కు నిర్వహణను పట్టించుకోకపోవడంతో పార్కులో పిచ్చి తుప్పలు పెరిగిపోయి పార్కు రూపురేఖలు మారిపోయాయి. పార్కులో విషపురుగుల సంచారంతో సందర్శించేందుకు వస్తున్న ప్రజలు భయాందోళన చెందుతున్నారు. బోట్లు సైతం చెరువులో కూరుకుపోయాయి. లక్షలాది ప్రజాధనం వృథా అయ్యిందని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కూడా పార్కు నిర్వహణపై దృష్టి సారించకపోవడంతో అధికారులు, పాలకుల తీరుపై ప్రజలు విమర్శలు గుప్పిస్తున్నారు. ఇక రాత్రి సమయంలో మందుబాబులు ఇక్కడ మద్యం సేవిస్తున్నట్లు పలువురు చెబుతున్నారు. పార్కు ప్రారంభంలో గేటు కింద భాగంలో తుప్పు పట్టడంతో అది గుచ్చుకోవడంతో సందర్శకులు కూడా గాయాలబారిన పడుతున్నారు. ప్రస్తుతం కళావిహీనంగా ఉన్న ఈపార్కును ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలని ప్రజలు కోరుతున్నారు.

టీడీపీ హయాంలోనే అభివృద్ధి

● పిఠాపురం మాజీ ఎమ్మెల్యే వర్మ



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వర్మ

పిఠాపురం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): మత్స్యకార గ్రామాల్లో జరిగిన అభివృద్ధి అంతా టీడీపీ ప్రభుత్వం, తాను ఎమ్మెల్యేగా ఉండగా జరిగిందేనని, తర్వాత జరిగింది శూన్యమని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ తెలిపారు. పిఠాపురం పట్టణంలోని తెలుగుదేశంపార్టీ కార్యాలయంలో గురువారం మత్స్యకార దినోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం మత్స్యకారులతో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ మత్స్యకార గ్రామాల్లో 90శాతం సీసీ రోడ్లు నిర్మించామని చెప్పారు. ఉప్పాడలో 3వేల వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించి ఇచ్చిన ఘనత తమదేనన్నారు. హార్బర్ నిర్మాణం కోసం రూ.300కోట్లు కేటాయించామని తెలిపారు. 1300బోట్లుకు ఒక్కపైసా అవినీతి లేకుండా డీజిల్ ఇప్పించామని చెప్పారు. సముద్రపు కోత నివారణకు జియోట్యూబ్ నిర్మాణంతో పాటు శాశ్వత పరిష్కారం నిమిత్తం ఎన్నికల ముందు టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు, యువగళం పాదయాత్రలో నారాలోకేష్, ఎన్నికల ప్రచారంలో డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ హామీ ఇచ్చారని వివరించారు. ఆ మేరకు ప్రతిపాదనలు సిద్ధమవుతున్నాయని తెలిపారు. మత్స్యకారులకు త్వరలో వేట విరామ భృతి అందుతుందని చెప్పారు. ఉప్పాడకు తాను ఎమ్మెల్యేగా ఉండగా అన్నక్యాంటీన్ మంజూరుచేసి స్థలం కేటాయించామని, వైసీపీ ప్రభుత్వం రాగానే దానిని అన్యాక్రాంతం చేశారని ఆరోపించారు. ఇక్కడ అన్నక్యాంటీన్ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. సమావేశంలో మత్స్యకార నాయకులు మెరుగు భూషణం, చొక్కా దావీద్, సీకోటి నానాజీ, చోడిపల్లి ప్రసాద్, బి.నాగేశ్వరరావు, జగన్నాధం, కొర్ని రమణ తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణంలో తనిఖీలు



దుకాణంలో తనిఖీలు చేస్తున్న వ్యవసాయాధికారులు

పెద్దాపురం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : జిల్లా వ్యవసాధికారి ఆదేశాల మేరకు పట్టణంలో ఎరువుల దుకాణంలో వ్యవసాధికారులు గురువారం తనిఖీలు చేపట్టారు. వ్యవసాయ సహాయ సంచాలకుడు కాకర్ల బాబూరావు ఆధ్వర్యంలో స్థానిక తాళ్లూరి సూర్యనారాయణ సన్స్ దుకాణంలో తనిఖీలు చేపట్టారు. ఎంఆర్‌పీ ధరలకు విక్రయాలు జరపాలని, తప్పనిసరిగా రైతుల కు బిల్లు ఇవ్వాలన్నారు. అనంతరం స్టాకును పరిశీలించారు. వ్యవసాయాధికారులు కొమ్మోజు సంజయ్‌కుమార్, లక్ష్మీ, ప్రసాద్ పాల్గొన్నారు.

దాతలు ఇచ్చిన స్థలం కబ్జా

● పాఠశాల స్థలాన్ని కాపాడాలని జనవాణిలో ఫిర్యాదు

గొల్లప్రోలు రూరల్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): పాఠశాల నిర్మాణం కోసం దాతలు ఇచ్చిన స్థలాన్ని కొందరు కబ్జా చేశారని, దానిని కాపాడాలని జనసేన పార్టీ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కార్యదర్శి జ్యోతుల శ్రీనివాస్ తదితరులు డిమాండ్ చేశారు. మంగళగిరిలోని జనసేన పార్టీ కేంద్ర కార్యాలయంలో గురువారం నిర్వహించిన జనవాణి కార్యక్రమంలో కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ శ్రీనివాస్‌కు దీనిపై వారు ఫిర్యాదును అందజేశారు. దీనిపై ఎంపీ స్పందిస్తూ పాఠశాల స్థలం ఆక్రమణ విషయాన్ని డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ దృష్టికి తీసుకువెళ్లి తక్షణం కబ్జా సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల తనిఖీ

గొల్లప్రోలురూరల్, నవంబరు 21: మద్దతు ధర కంటే తక్కువకు ఎవ్వరూ ధాన్యం అమ్ముకోవద్దని, కొనుగోలు కేంద్రాల ద్వారా విక్రయించుకోవాలని సివిల్ సప్లైస్ అసిస్టెంట్ మేనేజర్ విజయరాజు సూచించారు. ధాన్యంకొనుగోలు చేయడంలేదని రైతు తమ్మిరాజు జాయింట్ కలెక్టరుకు చేసిన ఫిర్యాదుపై గురువారం గొల్లప్రోలు, చేబ్రోలులోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన తనిఖీ చేశారు. తొమ్మిది ధాన్యం కొనుగోలు కేంద్రాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఆయన వెంట మండల వ్యవసాయాధికారి సత్యనారాయణ ఉన్నారు.

శెట్టిబలిజ సోదరులంతా తరలిరావాలి

తాళ్లరేవు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఈనెల 24న అమలాపురం కొంకాపల్లిలో కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుబాష్ ఆధ్వర్యంలో జరుగుతున్న కార్తీకవన సమారాధనకు శెట్టిబలిజ సోదరులంతా తరలివచ్చి విజయవంతం చేయాలని టీడీపీ శెట్టిబలిజ సాధికార డైరెక్టర్ పిల్లి సత్తిబాబు గురువారం కోరారు. శెట్టిబలిజ సోదరులు గంజా సూరిబాబు, కట్టా త్రిమూర్తులు, టేకుమూడి సత్యనారాయణ, పితాని విష్ణు, మేడిశెట్టి సత్తిబాబు, చీకట్ల నాగేశ్వరరావు, సూరంపూడి కుమార్, మట్టపర్తి శ్రీను, దంగేటి అప్పన్న పాల్గొన్నారు.

ఆటో, ద్విచక్ర వాహనం ఢీ

● పలువురికి స్వల్పగాయాలు

తాళ్లరేవు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జి.వేమవరం జామకాయల తూము సెంటరు 216 జాతీయ రహదారిపై జరిగిని రోడ్డుప్రమాదంలో పలువురికి గాయాలైనట్లు కోరింగ ఎస్‌ఐ పి.సత్యనారాయణ గురువారం తెలిపారు. తాళ్లరేవు నుంచి కాకినాడవైపు వస్తున్న ఆటో, కాకినాడ నుంచి వస్తున్న ద్విచక్రవాహనం జామకాయలతూము సెంటరులో ఎదురుగా ఢీకొన్నాయి. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న 10మందికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను కాకినాడ ప్రభుత్వాసుపత్రికి అంబులెన్స్‌లో తరలించారు. కోరింగ ఎస్‌ఐ సత్యనారాయణ కేసు నమోదుచేసినట్లు తెలిపారు.

24న అన్నవరం మహాపాదయాత్ర

గొల్లప్రోలు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసంలో ఏటా సత్యదేవుని సన్నిధికి నిర్వహించే మహాపాదయాత్రను ఈనెల 24న నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. గొల్లప్రోలు పట్టణంలోని విజయదుర్గా ఆలయంనుంచి 24న ఉదయం5.30కు పాదయాత్ర ప్రారంభమవుతుందని చెప్పారు. ఈ పాదయాత్రలో పాల్గొనదలచిన భక్తులు మహాపాదయాత్ర కమిటీని సంప్రదించాలని సూచించారు.

'లిఫ్టు ఏర్పాటు చేయాలి'

పిఠాపురంరూరల్, నవంబరు 21: పిఠాపురం మండలం రాపర్తి, పరిసర నెలకొన్న సాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి ఏలేరుపై గొర్రిఖండి వద్ద లిఫ్ట్ నిర్మించాలని రాపర్తి, భోగాపురం, బి.ప్రత్తిపాడు, పి.రాయవరం రైతులు డిమాండ్ చేశారు. వారి తరఫున రాపర్తికి చెందిన ముప్పిడి నారాయణరెడ్డి గురువారం మంగళగిరి జనసేన పార్టీ కార్యాలయంలో జరిగిన జనవాణిలో కాకినాడ ఎంపీ శ్రీనివాస్‌కు పలు అంశాలపై వినతులు అందజేశారు.

బ్రాహ్మణ సంఘాల హర్షం

కరప, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ప్రముఖ ఆలయాల ట్రస్ట్‌బోర్డు నియామకాల్లో కచ్చితంగా ఒక బ్రాహ్మణుడిని నియమించేలా శాసనసభలో బిల్లు చేయడంపట్ల బ్రాహ్మణసంఘాల నాయకులు హర్షం వ్యక్తంచేశారు. ఇప్పటికే ఆయా ఆలయాల అర్చకులు ట్రస్ట్‌బోర్డుకు ఎక్స్ అఫీషియోసభ్యుడిగా చెలామణి అవుతుండగా ప్రభుత్వ తాజా నిర్ణయంతో మరో బ్రాహ్మణుడికి బోర్డు సభ్యుడిగా అవకాశం లభించనుందని బ్రాహ్మణ, అర్చక, పురోహిత సంఘాల ప్రతినిధులు హర్షం వ్యక్తంచేశారు.

ప్రభుత్వపోరంబోకు స్థలం స్వాధీనం

సర్పవరం జంక్షన్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): కాకినాడ రూరల్ మండలం పండూరులో సర్వే నెంబర్ 110/7లో ఉన్న 6 సెంట్ల ప్రభుత్వ పోరంబోకు స్థలం ఆక్రమణకు గురికాగా,హైకోర్టు ఆదేశాల మేరకు స్వాధీనం చేసుకున్నట్లు ఆ గ్రామ పంచాయతీ కార్యదర్శి ఎం.రామ్మోహన్‌చౌదరి తెలిపారు. ఈ ఆక్రమణపై స్థానికులు అప్పటి కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా అప్పటి ప్రభుత్వ అధికారులు పట్టించుకోలేదు. దీంతో ప్రభుత్వ స్థలం అన్యాక్రాంతమైందని చర్యలు తీసుకోవాలని కోరుతూ స్థానికులు హైకోర్టును ఆశ్రయించడంతో ప్రభుత్వపోరంబోకు స్థలాన్ని ఆక్రమణదారుల నుంచి పంచాయతీ అధికారులు స్వాధీనం చేసుకోవాలని హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసిందని స్థానికులు భాస్కరరావు, కృష్ణలు తెలిపారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

గొల్లప్రోలు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని గొల్లప్రోలు ఎస్‌ఐ ఎన్.రామకృష్ణ సూచించారు. గొల్లప్రోలు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో సైబర్ క్రైమ్‌పై అవగాహన కల్పించారు. ఫైనాన్షియల్ సైబర్ ఫ్రాడ్స్, ఆన్‌లైన్ ట్రాప్స్, డిజిటల్ అరెస్టు పేరుతో జరుగుతున్న మోసాలు గురించి వివరించారు.

కరపలో..

కరప, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాల పట్ల ప్రతీఒక్కరూ అవగాహన పెంచుకుని అప్రమత్తంగా ఉండాలని కరప ఎస్‌ఐ తోట సునీత సూచించారు. పెనుగుదురు ఫిజియోథెరపీ కళాశాలలో గురువారం ఆమె విద్యార్థులతో సమావేశమై ఇటీవల ఇబ్బడిముబ్బడిగా సైబర్ నేరాలు జరుగుతున్నాయన్నారు. అమాయకులను టార్గెట్ చేసుకుని టెక్నాలజీ సాయంతో సైబర్ నేరాలకు పాల్పడుతూ రూ.కోట్లను దోచుకుంటున్నారన్నారు. తెలియని ఫోన్ కాల్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. విదేశీ కోడ్‌లతో వచ్చే ఫోన్ నెంబర్లను ఎత్తకపోవడమే ఉత్తమమని సూచించారు.

ఆరు స్క్వాడ్ బృందాల ఏర్పాటు

కాకినాడ రూరల్, నవంబరు 21: జిల్లాలో విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల డీలర్ల దుకాణాలలో తనిఖీలు నిర్వహించేందుకు ఆరు స్క్వాడ్ బృందాలు ఏర్పాటుచేసినట్లు జిల్లా వ్యవసాయ అధికారి ఎన్.విజయ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. విత్తనాలు, ఎరువులు, పురుగుమందులను అధిక ధరలకు విక్రయించడం, నాణ్యతలేని వాటిని అమ్మడం వంటి అవకతవకలకు పాల్పడరాదన్నారు. బృందంలో ఒక సహాయవ్యవసాయ సంచాలకులు, వ్యవసాయ అధికారి, స్థానిక వ్యవసాయ అధికారి ఉంటారన్నారు. ఇప్పటివరకూ జిల్లాలో సక్రమంగా నిర్వహించని ప్రిన్సిపల్ సర్టిఫికెట్స్ సరిగాలేని డీలర్‌షాపుల్లో రూ.12 లక్షల విలువ చేసే 74.34మెట్రిక్‌టన్నుల ఎరువుల అమ్మకాలను నిలిపివేసామని జిల్లా వ్యవసాయ అధికారి ఎన్.విజయ్‌కుమార్ తెలిపారు.

వేట నిషేధ పరిహారం చెల్లించాలి



నినాదాలు చేస్తున్న మత్స్యకార మహిళలు

కాకినాడ సిటీ, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): మత్స్యకార సమస్యలు పరిష్కరించాలని, వేట నిషేధ పరిహారం వెంటనే చెల్లించాలని మార్కెట్‌లో సదుపాయలు కల్పించాలని ఏపీ మత్స్యకారులు, మత్స్యకార్మిక సంఘం డిమాండ్ చేసింది. ప్రపంచ మత్స్య దినోత్సవం సందర్భంగా గురువారం సంఘం ఆధ్వర్యంలో మత్స్య మార్కెట్ల వద్ద జెండా ఆవిష్కరణ చేసి సమస్యలను సమస్యలు పరిష్కరించాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సంఘం జాతీయ కార్యవర్గ సభ్యురాలు సీహెచ్ రమణి, జిల్లా నాయకుడు యు.సత్యనారాయణ మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు ఎం.రాజశేఖర్, సుధా, దుర్గాదేవి, రాంబాబు, సింహాచలం, ధనలక్ష్మి పాల్గొన్నారు.

మత్స్యకారులను ప్రభుత్వం ఆదుకోవాలి



సీతారామపురంలో మత్స్యకార దినోత్సవం జరుపుకుంటున్న మత్స్యకారనేతలు

తాళ్లరేవు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి):సముద్రంలో మత్స్యసంపద నశించిపోతుండటంతో మత్స్యకారులు జీవనోపాధిని కోల్పోతున్నారని, ప్రభుత్వాలు మత్స్యకారులను ఆదుకోవాలని మాజీ జడ్పీటీసీ సభ్యుడు పెసింగి ఈశ్వరరావు అన్నారు. గురువారం సీతారామపురం కాలభైరవ స్వామి ఆలయ ప్రాంగణంలో ప్రపంచ మత్స్యకారుల దినోత్సవంను టీడీపీ నేత వాడ్రేవు వీరబాబు అధ్యక్షతన జరిగింది. అనంతరం ప్రపంచ మత్స్యకార దినోత్సవం సందర్భంగా కేక్ కట్ చేశారు.కార్యక్రమంలో కామాడి మాతరాజు, గాడిమొగ టీడీపీ గ్రామకమిటీ అధ్యక్షుడు సంగాడి కామేశ్వరరావు, మత్స్యకారనేతలు లంకే నూకరాజు, మల్లాడి వరదరాజు, వైదాడి శ్రీనివాసరావు, కొపనాతి దత్తాత్రేయవర్మ, కోలా కొండబాబు, తదితరులు పాల్గొన్నారు.

కొల్లాబత్తులకు డైరెక్టర్ పదవి సముచితం

● జిల్లా ఎస్సీ కార్పొరేషన్ రిటైర్డ్ ఈడీ మహిపాల్



ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ అప్పారావును సత్కరిస్తున్న దృశ్యం

కాకినాడ సిటీ, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ఒకే పార్టీలో వినయ, విధేయలతో కొనసాగిన కొల్లాబత్తుల చిత్తశుద్ధికి ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ పదవి ద్వారా సముచితస్థానం లభించిందని జిల్లా ఎస్సీ కార్పొరేషన్ రిటైర్డ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వి.మహిపాల్ అన్నారు. ఎస్.అచ్యుతాపురం కమ్యూనిటీ హాల్‌లో గురువారం ఏర్పాటు చేసిన ఆత్మీయ సన్మానంలో రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన కొల్లాబత్తుల అప్పారావును శాలువలు, పూలదండలతో సత్కరించారు. దళిత హక్కుల పోరాట సమితి, అంబేద్కర్ యువజన సంఘం, భవన నిర్మాణ కార్మిక సంఘం, స్థానిక పెద్దలు ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి కార్మిక నాయకుడు తోకల ప్రసాద్ అధ్యక్షత వహించారు. వివిధ సంఘాల నాయకులు బచ్చల చంద్రశేఖర్, కోనాల కృష్ణ, ముంజేరపు శ్రీరాములు, రాజశేఖర్ పండు అశోక్ కుమార్, పలివెల రవి, సీకోటి అప్పలకొండ, బంగారు సత్యనారాయణ, కౌజు నెహ్రూ, బత్తుల శామ్యూల్, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

చదువును కష్టంగా కాకుండా ఇష్టపడి చదవాలి

● భాష్యం విద్యాసంస్థల చైర్మన్ రామకృష్ణ



పది పరీక్షలపై అవగాహన కల్పిస్తున్న భాష్యం చైర్మన్ రామకృష్ణ

కాకినాడరూరల్, నవంబరు 21: చదువును కష్టంగా కాకుండా ఇష్టపడి చదవాలని భాష్యం విద్యాసంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ అన్నారు. కాకినాడ కాపుకళ్యాణ మండపంలో గురువారం కాకినాడ జిల్లాలోని భాష్యం విద్యాసంస్థలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు పరీక్షలపై అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యాసంస్థల ఈస్ట్ జోన్-1 జోనల్ ఇన్‌చార్జ్ వల్లూరి గోవిందరాజులు, జోన్-2 ఇన్‌ఛార్జ్ వి.ఆంజనేయులు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో రామకృష్ణ మాట్లాడుతూ విద్యార్థులంతా జన్మనిచ్చిన తల్లిదండ్రులు, విద్యను నేర్పిన గురువుల పట్ల విధేయతతో ఉండాలన్నారు. ప్రతీ విద్యార్థి ఉన్నతస్థానానికి చేరాలంటే ఉత్తమమైన ప్రతిభను కనబరచాలని సూచించారు. అనంతరం విద్యాసంస్థల సలహాదారుడు షైఖేల్‌రాజు మాట్లాడుతూ తల్లి జన్మనిస్తే, తండ్రి జీవితాన్నిస్తాడని, గురువు ఆజీవితానికి వెలుగును ప్రసాదిస్తాడన్నారు.

చిల్లపల్లికి జనసేన ఎంపీ, కుడా చైర్మన్ల అభినందన



అభినందిస్తున్న ఎంపీ, కుడా చైర్మన్లు

సామర్లకోట, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వైద్య మౌలికసదుపాయాల కల్పనా సంస్థ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన మంగళగిరి నియోజకవర్గ ఇన్‌చార్జి చిల్లపల్లి శ్రీనివాసరావును గురువారం కాకినాడ ఎంపీ తంగెళ్ళ ఉదయ్‌శ్రీనివాస్, కుడా చైర్మన్ కాకినాడ జిల్లా జనసేన అధ్యక్షుడు తుమ్మల బాబులు అభినందించారు. మంగళగిరిలో జరిగిన ప్రమాణస్వీకార కార్యక్రమానికి వీరు హాజరై అభినందించారు. కాకినాడ పార్లమెంట్ పరిధిలోని పెద్దాపురం నియోజక వర్గ జనసేన నాయకులు పాల్గొని చిల్లపల్లిని అభినందించారు.

సుబ్రహ్మణ్యేశ్వర స్వామి హుండీ లెక్కింపు

కాకినాడ రూరల్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): కాకినాడ రూరల్ మండలం ఇంద్రపాలెంలోని శ్రీమందేశ్వర సుబ్రహ్మణ్యేశ్వరస్వామి హుండీల ఆదాయాన్ని గురువారం లెక్కించినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి జోగా సత్యనారాయణ తెలిపారు. హుండీల ఆదాయాన్ని దేవదాయ, ధర్మదాయ శాఖ కాకినాడ డివిజన్ ఇన్‌స్పెక్టర్ వడ్డి ఫణేంద్రకుమార్ పర్యవేక్షణలో స్థానిక నాయకులు, భక్తులు, ఆలయ సిబ్బంది హుండీలను లెక్కించగా మొత్తం 70 రోజులకుగానూ రూ.1,31,996 ఆదాయం వచ్చిందన్నారు.

రెవెన్యూ అంశాలపై ప్రగతి చూపాలి

● కాకినాడ ఆర్డీవో మల్లిబాబు

కాకినాడ సిటీ, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): రీసర్వేకు సంబంధించి గ్రామసభల్లో వచ్చిన అభ్యంతరాలపై నిర్దీత గడువులో చర్యలు తీసుకోవాలని, డివిజన్ పరిధిలో రెవెన్యూ అంశాలపై ప్రగతి చూపాలని కాకినాడ ఆర్డీవో మల్లిబాబు ఆదేశించారు. డివిజన్ పరిధిలోని తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లతో కాకినాడలోని రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో ఆయన సమీక్షా గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ షెడ్యూల్ కులాలు, తెగలకు సంబంధించి ధ్రువపత్రాలు మంజూరు, ప్రభుత్వ సహాయ ప్రతిపాదనలు సత్వరం పంపించాలన్నారు. హిట్ అండ్ రన్ రోడ్డు ప్రమాదాల కేసుల్లో మరణించిన బాధిత కుటుంబాలకు తక్షణం ఆర్థిక సహాయం అందించే ప్రతిపాదనలపై విచారణ చర్యలు తీసుకో వాలన్నారు. సమావేశంలో కార్యాలయ పరిపాలనాధికారి జీఆర్ ఠాగూర్, తహసీల్దార్లు పితాని త్రినాథరావు, పీవీ సీతాపతిరావు, వి.జితేంద్ర, గోపాలకృష్ణ, చిన్నారావు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో మల్లిబాబు

శ్రీనివాసరావుకు కవితా నిధి పురస్కారం



పురస్కారం అందుకుంటున్న శ్రీనివాసరావు

పెద్దాపురం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : సాహితీ స్రవంతి సభ్యుడు పూడి శ్రీనివాసరావుకు విశాఖ పట్టణం శివానంద చారిటబుల్ ట్రస్ట్ కవితానిధి పురస్కారం అందజేసింది. ఎర్రవరం సూర్య కళాశాలలో తనకు ఈ పురస్కారంను అందజేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావును సాహితీవేత్తలు డాక్టర్ జ్యోశ్యుల కృష్ణబాబు, వంగలపూడి శివకృష్ణ, కొత్త శివ, చల్లా విశ్వనాథం, రవి, జయశ్రీ, సుబ్బారావు, తదితరులు అభినందించారు.

అంకితభావంతో పనిచేయాలి



జనసేన ఇన్‌చార్జి మర్రెడ్డిని కలిసిన కార్పొరేషన్ల డైరెక్టర్లు

గొల్లప్రోలు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ సూచనల మేరకు కార్పొరేషన్ల డైరెక్టర్లందరూ అంకితభావంతో పనిచేయాలని జనసేన పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు సూచించారు. పద్మశాలి, శెట్టిబలిజ, యాదవ, మాల కార్పొరేషన్ల డైరెక్టర్లుగా నియమితులైన చిన్నికృష్ణ, పెంకే జగదీష్, నారాయణమూర్తి, దానం లాజర్‌బాబులు మర్రెడ్డిని కలిసి తమకు అవకాశం కల్పించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

భీమేశ్వరాలయంలో విశేష కార్తీక పూజలు



సామర్లకోట, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాస మహాపర్వది నాలు పద్దెనిమిదో రోజు పురస్కరించుకుని సామర్లకోట కుమార రామ భీమేశ్వరాలయంలో గురువారం విశేష పూజలు నిర్వహించారు. ముందు గా తెల్లవారు జామున గోపూజలు నిర్వహించి పూజలను ప్రారంభించారు. ఆలయ అధికారుల ఆధ్వర్యంలో ఆలయ పండితులు సోమేశ్వర శర్మ, చెరుకూరి రాంబాబు, రాజశేఖర్ శర్మ, అంజిబాబు, వెంకన్న అభిషేక పూజలు, పుష్పార్చన పూజలు నిర్వహించారు. శ్రీపాద రాజశేఖర ఘనాపాఠి నేతృత్వంలో లక్షపత్రి పూజలలో పెద్దాపురంనకు చెందిన గోకిన శివబాబు దంపతులు ఆశీనులయ్యారు. సాయంత్రం మారేడుదళాలతో స్వామివారికి అర్చనలు నిర్వహించారు. సాయంత్రం ఆలయ ధ్వజస్థంభం వద్ద జరిగిన ఆకాశదీప పూజచేశారు. ఆలయ ఆవరణలో సుమారు 500మంది భక్తులకు అన్నదానం చేశారు.

స్వనిధి-స్వాభిమానంపై వీధి వ్యాపారస్తుల సదస్సు

సామర్లకోట, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): సామర్లకోట మున్సిపల్ మెప్మా కార్యాలయంలో గురువారం స్వనిధి -స్వాభిమానం పేరిట వీధి వ్యాపారస్తుల సదస్సు మెప్మా ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన కమిషనర్ శ్రీవిద్య మాట్లాడుతూ వీధి వ్యాపారస్తులకు బ్యాంకు లోన్లు సంక్షేమంతోపాటు స్వాభిమానం కూడా అవసరం అన్నారు. మెప్మా సీఎంఎం సయ్యద్ హుస్సేన్ మాట్లాడుతూ వీధి వ్యాపారస్తులు అసంఘటిత రంగ కార్మికులు తప్పనిసరిగా ఈ-శ్రమ, శ్రమయోగి మాన్‌ధన్ స్కీమ్‌లు పొందాలన్నారు. 60 సంవత్సరాలు వచ్చిన తరువాత నెలకు రూ.3వేల చొప్పున పింఛన్ పొందవచ్చన్నారు. కార్యక్రమంలో వీధివ్యాపారస్తులు, వెల్ఫేర్ కార్యదర్శులు, ఆర్పీలు పాల్గొన్నారు.

సర్పవరంలో రీసర్వే గ్రామ సభ

సర్పవరం జంక్షన్, నవంబరు 22 (ఆంధ్ర జ్యోతి): మండల రెవెన్యూ అధికారుల ఆధ్వ ర్యంలో గురువారం సర్పవరంలో మండల లెవెల్ సర్వే ఆఫీసర్ ఈ రామకృష్ణ నేతృత్వం లో రీసర్వే గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు రైతుల నుంచి వినతి పత్రాలు స్వీకరించారు. సర్పవరం భావనారాయణస్వామి ఆలయానికి చెందిన పలు ఈనాం భూములు పలు గ్రామాల్లో ఉన్నాయని, వీటికి సర్వే నిర్వహించి, దేవస్థానానికి అప్పగించేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ దేవదాయశాఖ సీనియర్ అసిస్టెంట్ కుమార్ లెటర్ అందించారు. కార్యక్రమంలో పలువురు వీ ఆర్వోలు, రైతులు పాల్గొన్నారు.

పురుగు మందుల షాపుల పరిశీలన

కోటనందూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): కోటనందూరు, కాకరాపల్లి గ్రామాల్లో గల ఎరువులు, పురుగు మందుల షాపులను వ్యవసాయ శాఖ ప్రత్యేక స్క్వాడ్ ఎస్.దైవకుమార్, ఏడీఏ పి.శ్రీనివాస్ మండల వ్యవసాయాధికారి చంద్రశేఖర్ ఉమ్మడి తనిఖీ చేశారు. పురుగు మందులకు పీసీలు లేని కారణంగా రూ.3,20,050 అమ్మకాలు నిలిపివేశారు.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • దేవీపట్నం • రాజవొమ్మంగి • అడ్డతీగల • గంగవరం • వై రామవరం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక



సమావేశంలో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో సింహాచలం

బాలికలు సత్ప్రవర్తనతో మెలిగేలా

అవగాహన కల్పించాలి

రంపచోడవరం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీలో 18 ఏళ్లలోపు బాలికలు సత్ప్రవర్తనతో మెలిగేలా అవగాహన కల్పించే బాధ్యత మనందరిపైనా ఉందని ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం అన్నారు. గురువారం ఐటీడీఏ కార్యాలయంలో ఐసీడీఎస్, విద్య, వెలుగు, వైద్య-ఆరోగ్య శాఖల అధికారులతో కిశోరీ వికాసం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ ఆడపిల్లలకు 18 ఏళ్లు నిండిన తర్వాతే పెళ్లి చేయాలన్నారు. సబ్ కలెక్టర్ కల్పశ్రీ మాట్లాడుతూ బాలికలు చదువుపై ఎక్కువ దృష్టిసారించాలన్నారు. ఆడపిల్లలకు 18 సంవత్సరాలు నిండకుండా పెళ్లి చేస్తే ప్రోత్సహించిన, పెళ్లిలో పాల్గొన్న శిక్షార్హులవుతారన్నారు.

కార్యక్రమంలో కిశోరీ వికాసం లీగల్ సెల్ ప్రొబేషన్ అధికారి ఎస్.అశోక్, జిల్లా బాలల సంరక్షణాధికారి టి.సిద్ధు, ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టరు సూర్యలక్ష్మి, అదనపు డీఎంహెచ్‌వో జి.శిరీష, వెలుగు ఏపీడీ డేగలయ్య, సీడీపీవోలు సంధ్యారాణి, లక్ష్మి, విజయగౌరి, మనమ్మ, డీపీఎం అపర్ణ, ప్రిన్సిపాల్ స్వామి పాల్గొన్నారు.

మంత్రి లోకేశ్ దృష్టికి విలీన మండలాల సమస్యలు

వీఆర్ పురం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): రంపచోడవరం నియోజకవర్గంలోని విలీన మండలాల సమస్యలను విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ దృష్టికి తీసుకెళ్లినట్టు రాష్ట్ర తెలుగు యువత కార్యదర్శి బొర్ర నరేష్‌కుమార్ తెలిపారు. గురువారం ఆయన మంత్రిని అమరావతిలో కలిసి పోలవరం ముంపు మండలాల సమస్యను వివరించారు. నాలుగు మండలాలకు ఒక్కరే ఎంఈవో ఉన్నారని, వీఆర్ పురం మండలానికి రెగ్యులర్ ఎంఈవోను నియమించాలని, ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకంపై దృష్టిసారించాలని, గిరిజన ప్రాంత యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరారు.



మంత్రి లోకేశ్‌కు సమస్యలు తెలుపుతున్న తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి నరేష్



సమావేశంలో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో సింహాచలం

అటవీ హక్కుల చట్టంపై అవగాహన

రంపచోడవరం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): అటవీ హక్కుల చట్టంపై గిరిజనులకు అవగాహన కల్పించాలని ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం అధికారులను ఆదేశించారు. గురువారం యూత్ ట్రైనింగ్ సెంటర్లో జరిగిన జన్ జాతీయ గౌరవ్ దివాస్ శిక్షణకు ఐటీడీఏ పీవో, సబ్ కలెక్టరు కల్పశ్రీ ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. గిరిజన రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పథకాలు అమలు చేస్తున్నాయన్నారు. 2005 డిసెంబరు 13కి ముందు సాగులో ఉన్న భూములను పూర్తిస్థాయిలో పరిశీలించి కమిటీల ద్వారా పట్టాలు మంజూరు చేస్తామన్నారు. రిసోర్స్‌పర్సన్లుగా రామ్‌గోపాల్, ఈశ్వరరావు, చంద్రకళ, మోహన్‌రావు, సంధ్య వ్యవహరించారు. డిప్యూటీ డైరెక్టర్ విజయశాంతి, ఏపీవో డీఎస్వీ రమణ, ఆర్‌వోఎఫ్ఆర్ సెల్ ప్రతినిధి జి.ఆనంద్, వైటీసీ మేనేజర్ సుదీష్ పాల్గొన్నారు.



పీహెచ్‌సీని తనిఖీ చేస్తున్న ఐటీడీఏ పీవో అపూర్వ భరత్

ఏడుగురాళ్లపల్లి పీహెచ్‌సీ ఆకస్మిక తనిఖీ

చింతూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఏడుగురాళ్లపల్లి ప్రాథమిక ఆసుపత్రిని చింతూరు ఐటీడీఏ పీవో అపూర్వభరత్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మలేరియా సోకిన వారి నుంచి రక్తపూతలు సేకరించే తీరుతో పాటు నిర్ధారణ పరీక్షలు చేస్తున్న తీరుని ఆయన పరిశీలించారు. ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలపై రోగులను ఆరా తీశారు. మలేరియా సోకిన వారిపై ప్రత్యేక దృష్టి సారించాలని వైద్యులను ఆదేశించారు. సిబ్బందితో నిరంతర పర్యవేక్షణ జరిపిస్తూ బాధితుల ఆరోగ్య స్థితిగతులను ఎప్పటికప్పుడు రికార్డు చేయాలన్నారు. ఆసుపత్రి రికార్డులను పరిశీలించారు. ఆసుపత్రుల ప్రాంగణాల్లో మొక్కలు నాటాలని కోరారు. డాక్టర్ ప్రసన్న, మలేరియా అసిస్టెంట్ అధికారి శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితులకు ఎమ్మెల్యే దంపతుల వితరణ

కూనవరం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చూచిరేవుల గ్రామంలో అగ్ని ప్రమాదంతో సర్వం కోల్పోయిన తెల్లం ముత్తయ్య కుటుంబానికి రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి-భాస్కర్ దంపతులు రూ.10వేలు ఆర్థిక సహాయం ప్రకటించారు. వారి తరఫున టీడీపీ నాయకులు అందజేశారు. బాధితులకు పక్కా ఇల్లు నిర్మిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ తెల్లం నిరోషా, గడ్డిపాటి ప్రసాద్, నేముల సత్యనారాయణ, గడేశుల రంజిత్‌కుమార్, సాయలి రాజేష్, నలజాల శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



బాధితులకు ఆర్థిక సాయం అందజేస్తున్న తెలుగుదేశం పార్టీ నాయకులు

నవజాత శిశ సంరక్షణపై అవగాహన



చింతూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): చింతూరు సామాజిక ఆరోగ్య కేంద్రంలో గురువారం నవజాత శిశు సంరక్షణపై అవగాహన సదస్సు ముగింపు సభ జరిగింది. సూపరింటెండెంట్ డాక్టర్ ఎంవీ కోటిరెడ్డి మాట్లాడుతూ ఈ నెల 15 నుంచి నవజాత శిశు సంరక్షణ వారోత్సవాలు నిర్వహించామన్నారు. నవజాత శిశు కేంద్రం వైద్యులు హర్ష, ధర్మతేజ నవజాత శిశువుల సంరక్షణపై బాలింతలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డాక్టర్ శశికళ, సిబ్బంది పాల్గొన్నారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

● కిర్లంపూడి పోలీస్‌స్టేషన్ తనిఖీ చేసిన ఎస్పీ



కిర్లంపూడి పోలీస్‌స్టేషన్‌లో రికార్డులు తనిఖీ చేస్తున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్



సూరంపాలెం ప్రగతి ఇంజనీరింగ్ కాలేజీలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

కిర్లంపూడి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): కిర్లంపూడి పోలీస్‌స్టేషన్‌ను గురువారం కాకినాడ జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆకస్మికంగా సందర్శించారు. ఈసందర్భంగా పోలీస్‌స్టేషన్ పరిసరాలను, భవనాన్ని పరిశీలించారు. స్టేషన్‌లోని వివిధ రికార్డులు తనిఖీచేసి కిర్లంపూడి ఎస్ఐ జి.సతీష్‌కుమార్‌కు పలు సూచనలు చేశారు. స్టేషన్‌ను శుభ్రంగా ఉంచాలని, రికార్డుల్లో ప్రతీ విషయాన్ని నమోదు చేసుకోవాలని, స్టేషన్‌కు వచ్చే వారితో మర్యాదపూర్వకంగా నడుచుకోవాలని సూచించారు. ఎస్పీ మాట్లాడుతూ సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, సామాజిక మాధ్యమాల్లో హద్దుమీరి ప్రవర్తిస్తే కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగరాదని, మద్యం తాగి వాహనాలు నడపరాదన్నారు. ఆయన వెంట పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు, జగ్గంపేట సీఐ వైఆర్‌కే శ్రీనివాస్ ఉన్నారు.

సైబర్ నేరాల నివారణపై అవగాహన సదస్సు

గండేపల్లి: మండలంలోని సూరంపాలెం గ్రామంలో ప్రగతి ఇంజనీరింగ్ కాలేజీలో గురువారం జగ్గంపేట సీఐ వైఆర్‌కె శ్రీనివాస్ ఆధ్వర్యంలో సైబర్ నేరాల నివారణకు మెగా సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఇటీవల సమాజంలో పెరిగిపోతున్న సైబర్ నేరాలు వాటి నూతన పోకడలు, నేరాల నివారణకు ఈ సమావేశం ఏర్పాటు చేశామన్నారు. సైబర్ నేరాల పట్ల, మాదకద్రవ్యాలు, మానవ అక్రమ రవాణాపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. సైబర్ నేరాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. కార్యక్రమంలో గండేపల్లి ఎస్ఐ యువి శివనాగబాబు, కాలేజీ సిబ్బంది పాల్గొన్నారు.

కోటనందూరు: కోటనందూరు మదర్ విద్యాసంస్థలులో డిగ్రీ కళాశాలలో సైబర్ నేరాల పట్ల పోలీసులు అవగాహన కల్పించారు. కాకినాడ ఎస్పీ విక్రాంత్‌పాటిల్ ఆదేశాలతో తుని సీఐ చెన్నకేశవరరావు పర్యవేక్షణలో ఎస్ఐ టి.రామకృష్ణ విద్యార్థులకు డిజిటల్ అరెస్టులు లేవని, ఆన్‌లైన్‌లో ఓటీపీ మోసం, ఫేక్ యాప్, ఆన్‌లైన్ లోన్ యాప్‌ల గురించి వివరించారు.

తుని రూరల్: సైబర్ నేరాల పట్ల యువత అవగాహన కలిగి అప్రమత్తంగా ఉండాలని తుని పట్టణ సీఐ గీతా రామకృష్ణ, ఎస్ఐ జె.విజయబాబు కోరారు. తుని పట్టణంలోని ఆదిత్య డిగ్రీ కాలేజీలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వీరు మాట్లాడుతూ విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించాలన్నారు. మనిషి జీవితంలో విద్యార్థి దశ కీలకమైనదని, విద్యార్థులు చదువుపై దృష్టి సారించాలన్నారు.

శంఖవరం: ప్రజలంతా సైబర్ నేరాలపై పూర్తిస్థాయి అవగాహన కలిగి ఉండాలని అన్నవరం అదనపు ఎస్ఐ ప్రసాద్ అన్నారు. గురువారం సీతారామా కళాశాలలో విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. డిజిటల్ అరెస్ట్, స్టాక్ మార్కెట్, జాబ్ కల్పిస్తామంటూ ఏమార్చి ఖాతాల నుంచి నగదు కాజేస్తున్నారని తెలిపారు.

'నాడు ఇచ్చి, నేడు ఆక్రమణదారులుగా చిత్రీకరిస్తారా'



ఆందోళన చేస్తున్న విఘ్నేశ్వర భవన నిర్మాణ కార్మికులు

ఏలేశ్వరం, నవంబరు21: (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికలకు ముందు కొంత మంది వైసీపీ నాయకులు విఘ్నేశ్వర భవన నిర్మాణ కార్మికుల సంఘం కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి కప్పలచెరువు సమీపంలో జగనన్న కాలనీవద్ద స్థలాన్ని కేటాయించి, ఇప్పుడు తమను దొంగలుగా చిత్రీకరించడం ఏమిటంటూ సంఘ నాయకులు ఘాటు విమర్శలు చేశారు. ఇటీవల వనభోజనాల కార్యక్రమం నిర్వహించి కార్మికులకే కాకుండా గ్రామంలోని ప్రజలకు, పార్టీలకతీతంగా నాయకులకు, పలు సంఘాలకు పిలుపు నిచ్చి వన సమారాధన కార్యక్రమం నిర్వహించిన మరుసటి రోజే వైసీపీ నాయకులు తప్పుడు ఆరోపణలు చేస్తూ అధికారులకు ఫిర్యాదు చేయడం ఏమిటని ప్రశ్నించారు. భవన నిర్మాణ కార్మికులకు అప్పటి ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్, తదుపరి నియోజకవర్గ వైసీపీ ఇన్ చార్జిగా బాధ్యతలు చేపట్టిన వరుపుల సుబ్బారావుల నేతృత్వంలో జరిగిన సభలలో పలుమార్లు జగనన్నకాలనీలో మిగులు భూమిని కమ్యూనిటీ హాల్‌కి ఇస్తామంటూ అదే ప్రాంగణంలో మరోసభ పెట్టి కమ్యూనిటీ హాల్‌కు స్థలాన్ని కేటాయించినట్లు తెలిపారు. ఇప్పుడు వైసీపీ నాయకులు సంఘంపై పలువురు అధికారులకు ఫిర్యాదులు చేయడం హాస్యాస్పద మన్నారు. ఆ స్థలంలో భవనాలను కట్టేందుకు సిద్ధమవుతున్నట్లు చెప్పిన నాయకులు ఎటువంటి కట్టడాలు సిద్ధమయ్యామో రుజువు చేయాలన్నారు. లేదంటే 1500మంది కార్మికుల కుటుంబాలతో సహా ఆరోపణలు చేసిన వైసీపీ నాయకుల తీరును ఎండగడుతూ ప్రజాబాహుల్యంలో నిజనిర్ధారణకు సిద్ధమవుతామని హెచ్చరించారు. విఘ్నేశ్వర భవన నిర్మాణ కార్మిక తాపీపనివార్ల సంఘం అధ్యక్షుడు నందకూరి నాగశంకర్, కార్యదర్శి పలికల శ్రీను, గౌరవాధ్యక్షుడు కర్రోతు మన్నియ్య, ఎల్లంశెట్టి రాము, బి.కొండబాబు, సత్యనారాయణ, దనేడి చిన్న, గెద్ద శ్రీను, శ్రీను, అప్పన్న, శ్రీను, రాజు, వీరబాబు పాల్గొన్నారు.

200 మందికి ఉచిత దంత వైద్యసేవలు

ప్రత్తిపాడు, నవంబరు21(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాచపల్లి గ్రామంలోని మాజీ సర్పంచ్ బుద్దరాజు సుబ్బరాజు స్వగృహం వద్ద గురువారం ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని అన్నవరం దేవస్థానం పాలక మండలి మాజీ సభ్యుడు బుద్దరాజు గోపిరాజు ప్రారంభించారు. రాజానగరం లెనోరా దంత వైద్యకళాశాల వైద్యులు అనేష్, ప్రత్యూష, గ్లోరీ, చందన, యశస్విని, బ్లెస్సీ, ఆకాంక్ష, జెన్నీఫర్, ఫణీంద్ర బృందం 200 మందికి దంత వ్యాధుల చికిత్సలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వత్సవాయి సూర్యనారాయణరాజు(మీసాల రాజు), స్థానిక నాయకులు గల్లాతాతారావు, రామకృష్ణ, చక్రి, మాజీ ఉప సర్పంచ్ బి.సూర్యనారాయణరాజు, గ్రామ పెద్దలు బి.రామకృష్ణరాజు, ఒమ్మంగి మాజీ సర్పంచ్ రామిశెట్టి మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల పనితీరు,

వేషధారణ బాగుండాలి

● సమగ్ర శిక్షా సీఎంవో చామంతి నాగేశ్వరరావు

ప్రత్తిపాడు, నవంబరు21(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయులు పనితీరు, వేషధారణ బాగుండాలని జిల్లా సమగ్ర శిక్ష సీఎంవో చామంతి నాగేశ్వరరావు చెప్పారు. మండలంలోని ఒమ్మంగి, ధర్మవరం, ప్రత్తిపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను, భవిత, ఐఈడీ కేంద్రాలను సమగ్ర శిక్ష సామాగ్రి నిల్వ గొడౌన్‌ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు టీషర్ట్‌లు ధరించి, మహిళా ఉపాధ్యాయులు డ్రస్‌లు వేసుకుని తరగతులకు రావడం తగదన్నారు. ఉపాధ్యాయులు వేషధారణ విద్యార్థుల బోధనా సామర్థ్యాల విషయంలో అలసత్వం వహిస్తే చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. అనంతరం ఒమ్మంగి హైస్కూల్లో విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం తిని ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించారు. కార్యక్రమాల్లో ఎంఈవో వి.రాజబాబు, ఒమ్మంగి హైస్కూల్ ఇన్‌చార్జ్‌హెచ్ఎం వి.ప్రకాష్, సీఆర్పీలు గంగారావు, మల్లేష్, బాష తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు

గండేపల్లి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ఆదిత్య గ్రూప్ ఆఫ్ ఫార్మసీ మరియు ఆదిత్య డిగ్రీ కాలేజీ ఫోరెనిక్స్ గ్రంథాలయ విభాగం ఆధ్వర్యంలో గ్రంథాలయ వారోత్సవాలు ఘనంగా ముగిశాయి. ఈ వారోత్సవాల్లో పుస్తక ప్రదర్శన, క్విజ్, చిత్రలేఖనం తదితర పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతి ప్రదానం చేశారు.

వాహనాల తనిఖీ

వై.రామవరం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక సెంటర్‌లో గురువారం సాయంత్రం పోలీసులు ప్రధాన రహదారి వెంట వెళ్లే వాహనాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎస్ఐ రామకృష్ణ పలు వాహనాలు స్వయంగా పరిశీలించారు. ఏజెన్సీ గ్రామాల నుంచి గంజాయి అక్రమ రవాణాపై ప్రత్యేక దృష్టి పెట్టామని దీనిలో భాగంగా పలు వాహనాలను తనిఖీ చేశామన్నారు. పలువురు అనుమానితులను ప్రశ్నించారు. వాహనదారుల నుంచి రికార్డులు పరిశీలించి నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి ప్రభుత్వాలు చొరవ చూపాలి

తుని రూరల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): తమ న్యాయపరమైన సమస్యలను ప్రభుత్వం పరిష్కరించే దిశగా చొరవ చూపాలని విద్యుత్ కాంట్రాక్ట్ అండ్ ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ కోరారు. తుని మండలం పద్మనాభ గెస్ట్‌హౌస్‌లో జగ్గంపేట డివిజన్ విద్యుత్ కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో డివిజన్ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్మిక నాయకులు మాట్లాడుతూ అనాదిగా వస్తున్న తమ సమస్యలను పరిష్కారాన్ని ప్రభుత్వం చొరవ చూపాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా జెన్‌కో, ట్రాన్స్‌కో, డిస్కంలో 30వేల పైబడి కార్మికులు ప్రమాదకరమైన సందర్భాల్లో పని చేస్తున్నారని కనీసం బీమా, జాబ్‌సెక్యూరిటీ, కనీస వేతన చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జగ్గంపేట డివిజన్ ప్రెసిడెంట్ భద్రాచలం, వైస్ ప్రెసిడెంట్ సాల్మన్‌రాజు, ట్రెజరర్ రంగబాబు, వైస్ ప్రెసిడెంట్ దర్గా, తుని సబ్ డివిజన్ ప్రెసిడెంట్ మనీష్‌గంగ, సభ్యులు సతీష్‌కుమార్, రమేష్, నాగభూషణం, కార్మికులు పాల్గొన్నారు.

యార్లగడ్డలో తాటాకిల్లు దగ్ధం

వై.రామవరం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని యార్లగడ్డలో అల్లంకుల మల్లయ్యకు చెందిన తాటాకిల్లు గురువారం దగ్ధమైంది. తహసీల్దారు వేణుగోపాల్ హుటాహుటిన వచ్చి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మధ్యాహ్నం ఎవరూ లేని సమయంలో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ వల్ల ఈ ప్రమాదం జరిగి ఉండవచ్చని స్థానికులు తెలిపారు. సుమారు రూ.1.50 లక్షలు ఆస్తి నష్టం జరిగినట్టు అంచనా వేశారు. తహసీల్దారు వెంట ఆర్ఐ శాంతకుమారి, వీఆర్వో ధనలక్ష్మి, వీఆర్ఏ దుర్గ ఉన్నారు.



కాలిపోయిన ఇంటిని పరిశీలిస్తున్న తహసీల్దారు వేణుగోపాల్

యూటీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి ప్రచారం

కూనవరం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా బరిలో వున్న యూటీఎఫ్ అభ్యర్థి బొర్రా గోపీమూర్తి గురువారం కూనవరం జడ్పీహెచ్ఎస్ ఉపాధ్యాయులను కలిసి తనకు ప్రథమ ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. కస్తూర్బా, కోతులగుట్ట పాఠశాలలతో పాటు మండలంలోని పలు పాఠశాలల్లో ప్రచారం చేశారు. యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వై.విల్సన్‌బాబు, జిల్లా కార్యదర్శులు పండా కృష్ణయ్య, నాగేశ్వరరావు, డీవీవీ సత్యనారాయణ, చారి, కన్నారావు, రాంబాబు, బాబు, సుబ్బారావు పాల్గొన్నారు.

సచివాలయ భవనాలను

తక్షణం నిర్మించాలి

దేవీపట్నం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండమొదలు, తున్నూరు పంచాయతీలకు సచివాలయ భవనాలను తక్షణం నిర్మించాలని ఆదివాసీ జేఏసీ రాష్ట్ర వైస్ చైర్మన్ తెల్లం శేఖర్ కోరారు. గురువారం ఆయన మాట్లాడుతూ కొండమొదలు గ్రామ పంచాయతీ పరిధిలో పెద్దభీంపల్లి-3 ఆర్అండ్ఆర్ కాలనీకి కొండమొదలు, మెట్టగూడెం, తాలిపేరు, తాళ్లూరు, నేలదోన నేలపాడు గ్రామాల ప్రజలు వచ్చి సుమారు నాలుగు సంవత్సరాలు దాటింద న్నారు. నేటికీ సచివాలయ భవనం నిర్మించకపోవడంతో సామాజిక భవనంలో నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో ఆదివాసీ నాయకులు యలగాడ నాగేశ్వరరావు, కారం రామన్నదొర, నడిపూడి భానుశంకరరెడ్డి, నడిపూడి గాంధీరెడ్డి, మడి గంగరాజు, నడిపూడి రాజారెడ్డి, మిర్తివాడ పోసిరెడ్డి పాల్గొన్నారు.

సత్యదేవ పడిపూజకు హాజరుకండి

● సత్యదీక్ష ప్రచారకర్త నల్లమిల్లి కృష్ణబాబు

గండేపల్లి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): అన్నవరం కొండపై శుక్రవారం జరిగే సత్యదేవ పడిపూజ కార్యక్రమానికి సత్యదీక్ష తీసుకున్న స్వాములందరూ తప్పనిసరిగా హాజరుకావాలని సత్యదీక్ష ప్రచారకర్త నల్లమిల్లి కృష్ణబాబు అన్నారు. శుక్రవారం ఆయన గండేపల్లి మండలం మల్లేపల్లి గ్రామంలో స్వాములను కలిసి పడిపూజకు ఆహ్వానించారు. కృష్ణబాబు మాట్లాడుతూ దీక్ష తీసుకున్న స్వాములందరికీ ఉచితంగా వ్రతాలు ఏర్పాటు చేశామన్నారు. రాత్రి పడిపూజ అనంతరం శనివారం ఉదయం స్వామివారి అభిషేకం, స్వాములకు ఇరుముళ్లు కట్టి విరమణ చేస్తామన్నారు. కార్యక్రమంలో దార్లంక శ్రీనివాస్, పోతుల సత్తిబాబు, వల్లభశెట్టి సూరి, పండు, తెమ్మనబోయిన జయ, అజ్జి చిన్న తదితరులు పాల్గొన్నారు.

'అపార్ ఐడీ కార్డుల సవరణ ప్రతి విద్యాసంస్థలో ఏర్పాటుచేయాలి'

అన్నవరం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా విద్యార్థులందరికీ ఒకే ఐడీ కార్డు ఉండాలనే ఉద్దేశంతో ఏర్పాటుచేసిన అపార్ ఐడీ కార్డుల తప్పొప్పుల సవరణ ప్రతి విద్యాసంస్థలో నెలకొల్పేలా చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ డిమాండ్ చేసింది. గడచిన 10రోజులుగా విద్యార్థులు ఆధార్ కేంద్రాలు, మీసేవా కేంద్రాల చుట్టూ తిరుగుతున్నారని ఒక పక్క చదువుకు దూరమవుతుండడంతో పాటు ఇదే అదనుగా ఆయా కేంద్రాలు విపరీతంగా డబ్బులు వసూలు చేస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గంగా సూరిబాబు పాల్గొన్నారు.

నేడు బుచ్చి సీతయ్యమ్మ వర్ధంతి

శంఖవరం, నవంబరు 21: (ఆంధ్రజ్యోతి) బాటసారులకు ఆకలి తీర్చేందుకు కత్తిపూడిలో సత్రం నిర్మించి, మండలంలో పలుచోట్ల భూములు దానంగా ఇచ్చిన బుచ్చి సీతయ్యమ్మ మహారాణి 189 వర్ధంతి నేడు. బాటసారులకు, వృద్ధులకు చీరలు, దుప్పట్లు పంపిణీ చేసి వారికి అన్నదానం నిర్వహిస్తున్నట్లు యర్రా వెంకటేశ్వరరావు తెలిపారు. నేటికి బాటసారులకు వసతి ఏర్పాట్లు చేస్తూ అవసరమైన వారికి భోజనం అందిస్తున్నామని ఆయన తెలిపారు.

'వైసీపీ కార్యకర్తలపై అక్రమ కేసులు తగదు'

ప్రత్తిపాడు, నవంబరు21(ఆంధ్రజ్యోతి):ప్రత్తిపాడు నియోజకవర్గంలో వైసీపీ కార్యకర్తలపై సోషల్ మీడియా సభ్యులపై అక్రమ కేసులు పెట్టడం తగదని ప్రత్తిపాడు నియోజకవర్గ వైసీపీ నేత ముదునూరి మురళీకృష్ణంరాజు చెప్పారు. మండలంలోని ఒమ్మంగి గ్రామంలో వైసీపీ మండల అధ్యక్షుడు రామిశెట్టి బులి రామకృష్ణపై అక్రమ కేసుల నేపథ్యంలో గురువారం ముదునూరి ఒమ్మంగి వెళ్ళి రామకృష్ణను పరామర్శించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పెడుతున్న అక్రమ కేసులను తీవ్రంగా ఖండించారు. కార్యక్రమంలో వైసీపీ జిల్లా ఉపాధ్యక్షుడు బెహరా దొరబాబు, వైస్ ఎంపీపీ ఏనుగు శ్రీనివాస్, సర్పంచ్ గొనగాల అప్పలరాజు, ఎంపీటీసీలు పిల్లా చిన్నా, జువ్వల సుజాతబాబులు, నానిపల్లి సత్యవతి చంటి, మొండిపీరబాబు, రామన్నదొర, రాణి చక్రధర్ పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో జైలు

ప్రత్తిపాడు, నవంబరు21(ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు, ఏలేశ్వరం, అన్నవరం పోలీస్‌స్టేషన్ల పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్‌లో దొరికిన ఇద్దరికి వారం రోజులు జైలు శిక్ష, ఐదుగురికి ఒక్కొక్కరికి రూ.10వేలు వంతున జరిమానా విధిస్తూ ప్రత్తిపాడు జ్యూడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కాటం భాను తీర్పు ఇచ్చారని సీఐ సూర్య అప్పారావు తెలిపారు. ప్రతి రోజు ప్రత్తిపాడు సర్కిల్ పరిధిలో తనిఖీలు నిర్వహిస్తామని చెప్పారు.

మల్లేపల్లిలో వనసమారాధన

గండేపల్లి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లేపల్లి గ్రామంలో గురువారం స్థానిక భక్తులు దార్లంక రాముడు-త్రిలోకం దంపతుల ఆధ్వర్యంలో కార్తీక మాసం సందర్భంగా వనసమారాధన నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులతో పాటు స్వామి, శివ, సత్యనారాయణస్వామి మాల దీక్షాధారులు హాజరై ఉసిరి చెట్టు వద్ద పూజలు చేసి అన్నప్రసాదాలు స్వీకరించారు. ప్రతీ సంవత్సరం కార్తీకమాసం సందర్భంగా అన్నదానం నిర్వహిస్తున్నామని రాముడు దంపతులు తెలిపారు.